ANN తెలుగు

Follow: @ANNTELUGU

29-04-2026

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 122 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## గూగుల్ పట్నం విశాఖ

### విశాఖ తీరాన ఏఐ సునామీ

**నవ్యాంధ్ర ప్రగతికి 'గూగుల్' హారతి.. మహా స్పెషల్**

(మహా ప్రత్యేకం)

భావితరాల భవిష్యత్తును శాసించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మహాయుగానికి ఆంధ్రప్రదేశ్ సగర్వంగా వేదికవుతోంది. దశాబ్దాలుగా కేవలం అలల హోరును, ఉక్కు కర్మాగారాల సైరన్లను విన్న విశాఖపట్నం తీరం.. నేడు ప్రపంచ టెక్నాలజీ గుండె చప్పుడుగా మారబోతోంది. టెక్ దిగ్గజం గూగుల్ అక్షరాలా రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో, విశాఖ గడ్డపై నిర్మించనున్న 'గ్లోబల్ ఏఐ క్లౌడ్ డేటా సెంటర్' రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలోనే ఒక సువర్ణాధ్యాయం. ఇది కేవలం ఒక భవన నిర్మాణమో, లేదా కొన్ని వేల కోట్ల పెట్టుబడో కాదు.. ఇది నిరుద్యోగ యువత కలల సాకారానికి దొరికిన అక్షయ పాత్ర. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు, ఐటీ మంత్రి నారా లోకేష్ కార్యదక్షతకు నిలువెత్తు సాక్ష్యం ఈ ప్రాజెక్టు. సముద్ర గర్భం గుండా ఖండాలను కలిపే సబ్‌సీ డేటా గేట్‌వే నుంచి, రెండు లక్షల ఉద్యోగాల సృష్టి వరకు.. ఏపీని ప్రపంచ ఐటీ పటంలో అగ్రగామిగా నిలబెట్టబోతున్న ఈ డిజిటల్ విప్లవంపై మహా పత్రిక ప్రత్యేక కథనం.

మిగతా 3లో

**టాప్ న్యూస్**

### డీజీపీగా సీవీ ఆనంద్



- నియమిస్తూ ఉత్తర్వులు
- బహుముఖ ప్రజ్ఞాశాలి

02

### నేడు పది ఫలితాలు

- మధ్యాహ్నం 2 గంటలకు వెల్లడి
- 5.15 లక్షల మంది విద్యార్థులకు రిజల్ట్




02

### తలసానికి కీలక బాధ్యతలు

- రాబోయే ఎన్నికల వ్యూహాలపై కేటీఆర్ చర్చ
- డబుల్ ఓట్ల విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని సూచన



02

### అద్భుత నగరంగా

# ఫ్యూచర్ సిటీ

## మూడు బుల్లెట్ ట్రైన్ మార్గాలు ఇక్కడే

జూన్ 2 కల్లా నాలుగో నగరం కార్యాలయం రెడీ

మీరు ఏడుస్తూనే ఉండండి.. నేను చేసుకుంటూ పోతా...

ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ చురకలు



**ఫ్యూచర్ సిటీ, మహా**

ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో అక్కడి ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌లు, కార్పొరేటర్లు ప్రభుత్వానికి సహకరిస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం జరిగితే ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల ప్రజాప్రతినిధులకు పాస్ పంపాలని పోలీసులకు సూచించారు. కొంతమంది తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారని, ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి కలెక్టర్, మంత్రికి పంపాలని తెలిపారు. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతామని, ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 7080 కి.మీ దూరం తగ్గుతుందన్నారు. కేంద్రం తీసుకురానున్న ఏడు హైస్పీడ్ రైళ్లలో మూడు రాష్ట్రం నుంచి వెళుతున్నాయని సీఎం తెలిపారు. బెంగళూరు నుంచి హైదరాబాద్, శంషాబాద్ నుంచి ముంబై, శంషాబాద్ నుంచి చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయని పేర్కొన్నారు.

**మీరు ఏడుస్తూనే ఉండండి**

కొంత మంది ఫ్యూచర్ సిటీ నిర్మాణం విషయంలో తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని రేవంత్ అన్నారు. ''మీరు ఏడుస్తూనే ఉండండి.. నేను చేసుకుంటూ పోతూనే ఉంటా'' అంటూ తనదైన శైలిలో ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. శుక్రాచార్యుడు ఫాంహౌస్ లో పడుకున్నాడని, మారీచుడు, సుబాహుడు జనంలో తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ అగ్రనేతలను ఉద్దేశించి అన్నారు. టోక్యో, సియోల్, సింగపూర్ వంటి ప్రపంచ స్థాయి

మిగతా 2లో



# నచ్చావయ్యా రేవంత్

## ప్రజాభిప్రాయంలో దూసుకుపోతున్న సీఎం

**ఏఎన్ఎన్ ఛానెల్ - మహా పత్రిక ఎక్స్‌క్లూజివ్ సర్వే రిపోర్ట్**

సన్నబియ్యం @ సూపర్ హిట్: 50 శాతం మంది ప్రజల ఓటు ఆ పథకానికే!

కేసీఆర్ కంటే రేవంత్ బెటర్: సర్వేలో మెజారిటీ నెటిజన్ల స్పందన

మహిళా పక్షపాతిగా సీఎం: 54 శాతం మంది మహిళల మద్దతు రేవంత్ సర్కార్‌కే

వ్యూహకర్తగా మార్కులు: అహంకారం లేని నాయకుడిగా పెరిగిన గ్రాఫ్

**మహా నెట్ వర్క్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ళ పాలనపై.. ఏఎన్ఎన్ ఛానెల్ - మహా పత్రిక సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు జేజేలు పలికారు. నచ్చావయ్యా.. రేవంతూ అనేశారు. సంక్షేమం, అభివృద్ధి, నాయకత్వ శైలిలో ముఖ్యమంత్రి తనదైన ముద్ర వేసినట్లు సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ 28న ఈ సర్వే నిర్వహించగా, వివిధ ప్రశ్నలకు వేలాదిమంది స్పందించి, తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టారు. సర్వే రిపోర్ట్ మహాపత్రిక పాఠకులకు ప్రత్యేకంగా..**

**సన్నబియ్యం.. సంక్షేమంలో 'సూపర్ హిట్'**

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఏది అత్యంత ప్రభావవంతంగా ఉందన్న ప్రశ్నకు ప్రజలు ఆసక్తికర సమాధానం ఇచ్చారు. సర్వేలో పాల్గొన్న 7,500 మందిలో 50 శాతం మంది 'సన్నబియ్యం' పంపిణీ పథకమే నెంబర్ వన్ అని తేల్చి చెప్పారు. పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా తెచ్చిన ఈ పథకం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అద్భుతమైన స్పందన పొందుతోంది. దీని తర్వాత మహిళల కోసం ఉద్దేశించిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణం పట్ల కూడా సానుకూలత వ్యక్తమైంది.

మిగతా 2లో

**మార్కుల్లోనూ రేవంత్ జోరు: 56 శాతం మద్దతు**

ముఖ్యమంత్రి పాలనపై రేటింగ్ కోరగా దాదాపు 10 వేల మంది నెటిజన్లు స్పందించారు. ఇందులో 56 శాతం మంది రేవంత్ రెడ్డి పాలన 'చాలా బాగుంది' అని కితాబు ఇచ్చారు. గత పదేళ్ల కేసీఆర్ పాలన కంటే రేవంత్ రెడ్డి పనితీరు చాలా మెరుగ్గా ఉందని 55 శాతం మంది స్పష్టం చేయడం విశేషం.

### మిలిటరీ వ్యయంలో

# టాప్-5లో భారత్

**పాక్ కంటే 9 రెట్లు ఎక్కువ వ్యయం**



**మహా:** ప్రపంచ సైనిక వ్యయంలో భారత్ టాప్ 5లో నిలిచింది. సైన్యాన్ని బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తూ, ప్రపంచంలోనే అత్యధిక సైనిక వ్యయం చేస్తున్న దేశాల్లో భారత్ 5వ స్థానంలో నిలిచింది. పాకిస్థాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్', చైనాతో సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ తన ఆయుధ సంపత్తిని భారీగా పెంచుకుంటోంది.

**టాప్-5 దేశాలు ఇవే!**

స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రీ) తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచ సైనిక వ్యయంలో కేవలం కొన్ని దేశాలే

మిగతా 2లో

### తెలంగాణలో

## 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు

**రాబోయే నాలుగైదు రోజుల్లో వర్షాలు**

ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో అధిక ఎండ తీవ్రత



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం అసాధారణమైన వాతావరణ వైవిధ్యానికి వేదికగా మారింది. ఒకవైపు అగ్నిగుండంలా మండుతున్న ఎండలు, మరోవైపు అకస్మాత్తుగా విరుచుకుపడుతున్న భీకర వడగండ్ల వానలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య కనిపిస్తున్న ఈ విరుద్ధ పరిస్థితులు పర్యావరణవేత్తలను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి. గత కొద్దిరోజులుగా భానుడు తన ప్రచండ రూపంతో జనాన్ని బెంబేలెత్తిస్తుండగా, మంగళవారం మధ్యాహ్నం నుంచి

మిగతా 2లో

### పంజాబ్ జైత్రయాత్రకు

# రాయల్ బ్రేక్




- జైపూర్ కోటలో రాజస్థాన్ విశ్వరూపం
- ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం
- ఐపీఎల్ 2026: మలుపు తిప్పిన జైపూర్ సమరం
- పాయింట్ల పట్టికలో రాయల్స్ హవా

**హైదరాబాద్, మహా:** ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస విజయాలతో అప్రతిహతంగా దూసుకుపోతున్న పంజాబ్ కింగ్స్ జైత్రయాత్రకు జైపూర్ వేదికగా బ్రేక్ పడింది. ఇరు జట్ల మధ్య జరిగిన పోరు కేవలం క్రికెట్ మ్యాచ్‌లా కాకుండా, వ్యూహప్రతివ్యూహాల రణక్షేత్రంలా సాగింది. పంజాబ్ జోరును చూసి ఈ మ్యాచ్ ఏకపక్షం అవుతుందని భావించిన విశ్లేషకులకు, రాజస్థాన్ రాయల్స్ తమ అద్భుత ప్రదర్శనతో సమాధానమిచ్చారు. సర్వశక్తులూ ఒడ్డి పోరాడిన పంజాబ్‌ను 6 వికెట్ల తేడాతో

మిగతా 2లో

# నచ్చావయ్యో.. రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

మహిళల పక్షపాతిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం గట్టి విశ్వాసాన్ని గెలుచుకుంది. మహిళలకు ఎవరి పాలనలో న్యాయం జరిగిందన్న ప్రశ్నకు 54 శాతం మంది రేవంత్ వైపే మొగ్గు చూపారు. గత ప్రభుత్వంలో కవిత ప్రాధాన్యత పెంచేందుకే మహిళలకు మంత్రి పదవులు ఇవ్వలేదన్న అభిప్రాయాన్ని 64 శాతం మంది వ్యక్తం చేశారు.

**వ్యూహకర్తగా.. అహంకారం లేని నేతగా..**

రేవంత్ రెడ్డిలో మీకు నచ్చే అంశం ఏంటని ప్రశ్నించగా.. ఆయన ఒక మంచి వ్యూహకర్త, అనుకున్నది సాధించే మొండితనం ఉన్న నాయకుడని 28 శాతం మంది అభిప్రాయపడ్డారు. పదవిలో ఉన్నా అహంకారం లేకపోవడం ఆయనలోని గొప్ప లక్షణమని 23 శాతం మంది పేర్కొన్నారు.

**మంత్రుల పనితీరు: భట్టికే అగ్రతాంబూలం**

ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రుల పనితీరుపై సర్వే నిర్వహించగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మిగతా ఇద్దరి కంటే మెరుగైన పనితీరు కనబరుస్తున్నారని ప్రజలు తీర్పునిచ్చారు. రేవంత్ రెడ్డి దూకుడుకు, పారదర్శక పాలనకు ప్రజలు పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతున్నారని సర్వే ద్వారా స్పష్టమైంది.

# తలసానికి కీలక బాధ్యతలు

## రాబోయే ఎన్నికల వ్యూహాలపై కేటీఆర్ చర్చ

## డబుల్ ఓట్ల విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని సూచన

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈరోజు జరిగిన కీలక సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలతో కలిసి ఆయన రాబోయే ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు కీలక బాధ్యతలను అప్పగించారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు. ముఖ్యంగా గత ఎన్నికల్లో జుబ్లీహిల్స్ వంటి చోట్ల జరిగిన పరిణామాలను గుర్తు చేస్తూ, ప్రత్యర్థి పార్టీలు నమోదు చేయించే దొంగ ఓట్లు, డబుల్ ఓట్లను గుర్తించి... వాటిని తొలగించేలా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. నగరంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడటం, కొత్త ఓటర్ల నమోదులో కార్యకర్తలు చొరవ చూపడంపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ మొత్తం కార్యక్రమానికి పర్యవేక్షకుడిగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కేటీఆర్ నియమించారు. ఈ బాధ్యతలపై తలసాని మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో బూత్ లెవల్ అసిస్టెంట్లను తక్షణమే నియమించాలని కోరారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు జరగకుండా బూత్ స్థాయి నుంచే కాపలా కాయాలని స్పష్టం చేశారు. నగర రాజకీయాల్లో ఓటర్ల జాబితాయే గెలుపోటములను నిర్ణయిస్తుందని, అందుకే దీనిపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని ఆయన పార్టీ నేతలకు సూచించారు.

# మిలిటరీ వ్యయంలో టాప్-5లో భారత్

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన వాటాను కలిగి ఉన్నాయి. వాటిలో అమెరికా 954 బిలియన్ డాలర్లతో అందరి కంటే చాలా ముందు వరుసలో ఉంది. చైనా 336 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉంది. తద్వారా వరుసగా 31 ఏళ్లపాటు రక్షణ బడ్జెట్‌ను పెంచిన దేశంగా తన రికార్డును అలాగే పదిలంగా కొనసాగిస్తోంది. మరోవైపు ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యా రక్షణ వ్యయం కోసం 190 బిలియన్ డాలర్లను కేటాయించింది. ఈ విధంగా అది ఈ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. జర్మనీ తన సైనిక వ్యయాన్ని 24 శాతం మేర భారీగా పెంచింది. తద్వారా దాని రక్షణ వ్యయం 114 బిలియన్ డాలర్లకు చేరి నాలుగో స్థానంలో నిలిచింది. సిప్రీ నివేదిక ప్రకారం, గ్లోబల్ డిఫెన్స్ ట్రెండ్స్‌లో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. 2025 సంవత్సరానికి గాను భారత్ తన సైనిక రంగంపై 92.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేసి ప్రపంచంలో ఐదో స్థానంలో నిలిచింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 8.9 శాతం ఎక్కువ. ప్రపంచ సైనిక వ్యయంలో ఇది 3.2 శాతం. పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సింధూర్, సైనిక వ్యవస్థలను అత్యవసరంగా కొనుగోలు చేయడం వల్లే భారత్ వ్యయం అమాంతం పెరిగింది. ఇక దాయాది దేశం పాకిస్థాన్ కూడా తన సైనిక వ్యయాన్ని 11 శాతం పెంచి 11.9 బిలియన్ డాలర్లకు చేర్చింది. తద్వారా 40 దేశాల జాబితాలో పాక్ 31వ స్థానంలో నిలిచింది. ఏదిఏమైనప్పటికీ పాక్‌తో పోలిస్తే భారత సైనిక వ్యయం దాదాపు 9 రెట్లు అధికంగా ఉండడం గమనార్హం. చైనా, పాకిస్థాన్‌తో ఉన్న ఉద్రిక్తతల వల్లే భారత్ ఆయుధ కొనుగోళ్లను వేగవంతం చేసిందని సిప్రీ నివేదిక స్పష్టం చేసింది.

# అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ



(మొదటిపేజీ తరువాయి)

నగరాలతో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీని నిర్మించడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ దిశగా రోడ్లు సహా అన్ని మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడుల ఒప్పందాలు ఇక్కడే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ సమిట్ ద్వారా ప్రపంచానికి విశ్వాసం కలిగిందన్న సీఎం సైబరాబాద్, హైటెక్ సిటీ, ఓఆర్ఆర్, విమానాశ్రయ నిర్మాణం మన కళ్ల ముందే అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. అభివృద్ధి ప్రాంతాలుగా తీర్చిదిద్దిన ఆనాటి నాయకులను కొంతమంది అవహేళన చేశారని అన్నారు.

**అద్భుతమైన నగరానికి పునాదులు**

దేశంలో ఏ నగరానికి లేనివిధంగా 160 కిలో మీటర్ల మేర ఓఆర్ఆర్ నిర్మించారని సీఎం గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీకి భూములిచ్చే రైతులను ఆదుకునే బాధ్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. చట్టపరంగా నోటిఫికేషన్లు, న్యాయపరమైన ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయ్యిందన్న ఆయన భూమి ఇవాళ కాకపోతే రేపు అయినా ప్రభుత్వానికి బదిలీ అవుతుందని తెలిపారు. భూమి బదిలీ ఆగే అవకాశం లేదని, తాత్కాలికంగా వాయిదా పడవచ్చని చెప్పారు. ప్రభుత్వం తరఫున ప్రక్రియ జరిగినపుడే పరిహారం డబ్బులు తీసుకుంటే మరోచోట తక్కువ ధరకు భూములు వచ్చేవని రైతులనుద్దేశించి సీఎం అన్నారు. ఆలస్యమైతే ఎకరాల్లో భూసేకరణ జరిగితే పరిహారం డబ్బులతో గజాల్లో కూడా వేరే చోట భూమి రాదని పేర్కొన్నారు. బాధితుల పిల్లలకు స్కిల్స్ వర్సిటీలో నైపుణ్య శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకుంటామని, ప్రజాప్రతినిధులు బాధితులతో మాట్లాడి అభద్రతా భావాన్ని తొలగించాలన్నారు. అభివృద్ధికి భూమిలిచ్చిన రైతులను గౌరవించాలని, స్థానికులు సహకరిస్తే ప్రపంచంలోనే అద్భుత నగరానికి పునాదులు వేగంగా పడతాయని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, .జూపల్లి క్రిష్ణారావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ , ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, డీజీపీ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కసారిగా మారిన వాతావరణం పలు జిల్లాల్లో ప్రకృతి ప్రకోపాన్ని తలపించింది. అగ్నిగోళంలా మారిన ఆకాశం నుంచి నిమిషాల వ్యవధిలోనే పిడుగులు, వడగండ్లు కురవడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది.

**ఉత్తర తెలంగాణలో నిప్పుల కుంపటి**

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వేడి తీవ్రత గరిష్ఠ స్థాయికి చేరుకొని రికార్డులను తిరగరాస్తోంది. ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటి నమోదవుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. పగటిపూట వీస్తున్న వేడి గాలులు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతుండగా, వృద్ధులు, చిన్నపిల్లలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఎండల తీవ్రత రాబోయే రెండు మూడు రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని, ఉత్తర మరియు మధ్య తెలంగాణ ప్రాంతాల్లో ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభించడం ఇప్పుడప్పుడే సాధ్యం కాదని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**దక్షిణాన వడగండ్ల బీభత్సం**

మరోవైపు, దక్షిణ తెలంగాణలో ప్రకృతి ఉగ్రరూపం దాల్చింది. నల్గొండ మరియు నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మంగళవారం సాయంత్రం సంభవించిన తుపాను బీభత్సం సృష్టించింది. గంటకు 70 కిలోమీటర్ల వేగంతో వీచిన పెను గాలులు, పిడుగుల గర్జనలు



ప్రజలను గడగడలాడించాయి. నల్గొండ జిల్లాలోని మునుగోడు, దేవరకొండ ప్రాంతాల నుంచి నాగర్‌కర్నూల్‌లోని అచ్చంపేట, అమ్రాబాద్ వరకు వడగండ్ల వాన బీభత్సం సాగింది. భారీ పరిమాణంలో రాలిన వడగండ్లు పంట పొలాలను దెబ్బతీయడమే కాకుండా, వాహనాలను, ఇళ్లపై ఉన్న రేకులను ధ్వంసం చేశాయి. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున రైతులు, గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండవద్దని ప్రభుత్వం అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది.

**ప్రకృతి మార్పుల వెనుక శాస్త్రీయ కారణం**

ఈ అనూహ్య వాతావరణ మార్పులకు ప్రధాన కారణం వాతావరణంలో ఏర్పడిన ద్రోణి మరియు క్యుములోనింబస్ మేఘాల ప్రభావమేనని విశ్లేషకులు చెబుతున్నారు. విపరీతమైన ఎండల వల్ల భూమి వేడెక్కి, గాలిలోని తేమతో కలిసి శక్తివంతమైన తుపాను మేఘాలు ఏర్పడుతున్నాయి. ఇవి అతి తక్కువ సమయంలోనే తీవ్రమైన వర్షాన్ని, వడగండ్లను కురిపించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఈ అనిశ్చితి వల్ల ఒకచోట ఎండలు మండిపోతుంటే, కేవలం కొన్ని కిలోమీటర్ల దూరంలోనే కుండపోత వడగండ్ల వాన కురిసే వింత పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ మేఘాల కదలికలు అత్యంత వేగంగా మారుతుండటంతో అంచనాలు వేయడం కూడా వాతావరణ శాఖకు సవాలుగా మారింది.

**హైదరాబాద్‌లో వాతావరణ దోబూచులాట**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విషయంలో వాతావరణం భిన్నంగా స్పందించింది. నగరంలో భారీ వర్షం కురుస్తుందని వాతావరణ హెచ్చరికలు ఉన్నప్పటికీ, ఉత్తర దిశ నుంచి వీచిన పొడి గాలుల కారణంగా మేఘాలు చెల్లాచెదురయ్యాయి. అయితే, పొరుగున ఉన్న నాగర్‌కర్నూల్, నల్గొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో ఏర్పడిన 'గస్ట్ ఫ్రంట్' నగరాన్ని పలకరించింది. దీనివల్ల వర్షం కురవకపోయినా, ఒక్కసారిగా వీచిన వేగవంతమైన చల్లని గాలులు నగరవాసులకు ఎండ వేడి నుంచి గొప్ప ఉపశమనాన్ని ఇచ్చాయి. రాత్రి వేళ వాతావరణం ఆహ్లాదకరంగా మారినప్పటికీ, నగరంలోని దక్షిణ ప్రాంతాల్లో అక్కడక్కడా తుపాను మేఘాలు ఏర్పడే అవకాశం ఉండటంతో అప్రమత్తత అవసరమని అధికారులు సూచించారు.

**రాబోయే ఐదు రోజులు అత్యంత కీలకం**

రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా ఇదే తరహా అనిశ్చిత వాతావరణం కొనసాగనుంది. ఖమ్మం, సూర్యాపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కొత్తగా తుపాను మేఘాలు ఏర్పడే అవకాశం ఉందని, సాయంత్రం వేళల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే ప్రమాదం ఉందని తాజా సమాచారం అందుతోంది. రైతాంగం ముఖ్యంగా చేతికి వచ్చిన పంటలను రక్షించుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించడమైంది. అటు ఎండల తీవ్రత, ఇటు ఆకస్మిక తుపాన్ల నేపథ్యంలో ప్రజలు వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండటమే ప్రస్తుత తక్షణావసరం.

# నేడు పది ఫలితాలు

## మధ్యాహ్నం 2 గంటలకు వెల్లడి.. 5.15 లక్షల మంది విద్యార్థులకు రిజల్ట్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పదో తరగతి ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. రేపు (ఏప్రిల్ 29) మధ్యాహ్నం 2 గంటలకు ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేయనున్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. గత నెల 14న ప్రారంభమైన పదో తరగతి ప్రధాన పరీక్షలు ఈ నెల 13వ తేదీతో ముగిశాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకాగా, ఈ నెల 23వ తేదీ నాటికే జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియను అధికారులు అత్యంత వేగంగా పూర్తి చేశారు. మే మొదటి వారంలో ఫలితాలు వెలువడతాయని తొలుత భావించినప్పటికీ, విద్యాశాఖ చొరవతో ఏప్రిల్ నెలాఖరులోనే ఫలితాలను సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదం పొందారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ముఖ్య అతిథిగా హాజరై ఫలితాలను విడుదల చేస్తారు. విద్యార్థుల జీవితంలో పదో తరగతి అనేది ఒక కీలకమైన మలుపు. ఫలితాల వెల్లడి అనంతరం విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం సరైన కోర్సును ఎంచుకోవడంపై దృష్టి సారించాల్సి ఉంటుంది. కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకుండా, తమ ఆసక్తి మరియు సామర్థ్యానికి అనుగుణంగా కోర్సులను ఎంచుకోవాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. ఇక్కడ తీసుకునే సరైన నిర్ణయం భవిష్యత్తు బంగారుమయం కావడానికి పునాది వేస్తుంది. ఇంటర్మీడియట్ సాధారణ కోర్సులతో పాటు పాలిటెక్నిక్ మరియు ఐటీఐ వంటి వృత్తి విద్యా కోర్సులు కూడా నేడు విద్యార్థులకు అనేక అవకాశాలను కల్పిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గురుకుల విద్య నేడు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా రాణిస్తోంది. ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ గురుకులాల్లో నాణ్యమైన ఆంగ్ల బోధనతో పాటు ఉచిత వసతి, రుచికరమైన భోజన సౌకర్యాలు కల్పిస్తారు. విద్యార్థులను కేవలం పరీక్షలకే కాకుండా ఎప్సెట్, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఏకలవ్య మరియు ఆదర్శ పాఠశాలలు ఇంగ్లీష్ మీడియంలో ఉన్నత విద్యను అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నాయి. సాధారణ చదువులతో పాటు వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించడం ఇక్కడ ప్రత్యేకత. మరోవైపు, త్వరగా ఉపాధి పొందాలని ఆశించే విద్యార్థులకు ఐటీఐ కోర్సులు ఉత్తమ మార్గంగా నిలుస్తున్నాయి. పదో తరగతి అర్హతతో ఐటీఐ కళాశాలల్లో చేరి, తమకు నచ్చిన ట్రేడ్‌ను ఎంచుకోవచ్చు. పారిశ్రామిక రంగంలో ఐటీఐ పూర్తి చేసిన వారికి నేడు మంచి డిమాండ్ ఉంది. నైపుణ్యం ఉంటే స్వయం ఉపాధితో పాటు ప్రముఖ పరిశ్రమల్లో స్థిరపడటం సులువవుతుంది. విద్యార్థులు తమ అభిరుచులను గుర్తించి, సరైన కెరీర్ మార్గాన్ని ఎంచుకోవాల్సిన సమయం ఇదేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎంతో శ్రమించి పరీక్షలు రాసిన విద్యార్థుల భవితవ్యం రేపు తేలనున్న నేపథ్యంలో విద్యాశాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది.

# పంజాబ్ జైత్రయాత్రకు రాయల్ బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

చిత్తు చేస్తూ, రాజస్థాన్ తన సొంత గడ్డపై 'రాయల్' విక్టరీని నమోదు చేసింది. ఈ విజయం లీగ్ దశలో రాజస్థాన్‌కు కొత్త ఊపిరిని పోయడమే కాకుండా, పాయింట్ల పట్టికలో సమీకరణాలను ఒక్కసారిగా మార్చివేసింది.

**సమర శంఖారావం:**

**హోరాహోరీ పోరుకు తెరలేచిన వేళ**

మ్యాచ్ ఆరంభానికి ముందే స్టేడియం అభిమానుల కోలాహలంతో నిండిపోయింది. టాస్ గెలిచిన రాజస్థాన్ కెప్టెన్ ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించి, తమ బౌలింగ్ విభాగంపై ఉన్న నమ్మకాన్ని చాటుకున్నారు. పంజాబ్ కింగ్స్ తమదైన శైలిలో ఇన్నింగ్స్‌ను వేగంగా ప్రారంభించినప్పటికీ, రాజస్థాన్ బౌలర్లు క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో వారిని కట్టడి చేశారు. మైదానంలో ప్రతి పరుగు కోసం బ్యాటర్లు పోరాడాల్సి వచ్చింది. ఫీల్డింగ్‌లోనూ రాజస్థాన్ ఆటగాళ్లు అప్రమత్తంగా ఉంటూ కీలకమైన పరుగులను అడ్డుకోవడంతో, పంజాబ్ భారీ స్కోరు సాధించాలనే ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. మ్యాచ్ మొదటి బంతి నుంచే ఇరు జట్ల మధ్య గెలుపు కోసం సాగిన ఆరాటం ప్రేక్షకులకు కనువిందు చేసింది.

**పంజాబ్ ధాటి..**

**రాజస్థాన్ కట్టుదిట్టమైన వ్యూహం**

తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లు భారీ షాట్లతో విరుచుకుపడాలని ప్రయత్నించారు. ఓపెనర్లు శుభారంభం చేసినప్పటికీ, రాజస్థాన్ స్పిన్నర్లు మధ్య ఓవర్లలో మ్యాచ్‌ను తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ముఖ్యంగా గూగ్లీలు, క్యారమ్ బాల్స్‌తో పంజాబ్ బ్యాటర్లను తికమక పెట్టడంలో రాయల్స్ బౌలర్లు సఫలమయ్యారు. పంజాబ్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు వికెట్ కాపాడుకుంటూనే స్కోరు బోర్డును పరిగెత్తించడానికి ప్రయత్నించినప్పటికీ, రాజస్థాన్ ఫీల్డర్ల చురుకుదనం వారిని ఒత్తిడిలోకి నెట్టింది. నిర్ణీత ఓవర్లలో పంజాబ్ గౌరవప్రదమైన స్కోరు సాధించినప్పటికీ, అది రాజస్థాన్ వంటి పటిష్టమైన బ్యాటింగ్ లైనప్‌ను అడ్డుకోవడానికి సరిపోదని విశ్లేషకులు భావించారు.

**బౌలింగ్ పదును: వికెట్ల పతనం..**

**పరుగుల నియంత్రణ**

రాజస్థాన్ బౌలింగ్ విభాగం ఈ మ్యాచ్‌లో వెన్నెముకగా నిలిచింది. డెత్ ఓవర్లలో యార్కర్లు, స్లోయర్






డెలివరీలతో పంజాబ్ కింగ్స్‌ను కట్టడి చేసిన తీరు అమోఘం. పంజాబ్ కెప్టెన్ ప్లాన్ చేసిన భారీ హిట్టింగ్‌ను రాజస్థాన్ పేసర్లు సమర్థవంతంగా అడ్డుకున్నారు. కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ పంజాబ్ జోరుకు కళ్లెం వేశారు. పంజాబ్ జట్టు ఒకానొక దశలో 200 పరుగుల మార్కును దాటుతుందనిపించినా, రాజస్థాన్ బౌలర్ల వ్యూహాత్మక దాడుల వల్ల వారు తక్కువ స్కోరుకే పరిమితం కావాల్సి వచ్చింది. బౌలర్లు సమిష్టిగా రాణించడం, కెప్టెన్ బౌలింగ్ మార్పులను సమర్థవంతంగా అమలు చేయడం రాజస్థాన్ విజయానికి పునాది వేసింది.

**లక్ష్య ఛేదనలో రాజసం:**

**ఓపెనర్ల మెరుపు ఆరంభం**

అనంతరం భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఏమాత్రం తడబడలేదు. ఓపెనర్లు మొదటి ఓవర్ నుంచే పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. పవర్‌ప్లేను అద్భుతంగా వినియోగించుకుంటూ ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. పంజాబ్ బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్ తప్పడంతో రాజస్థాన్ బ్యాటర్లకు పని సులువైంది. మైదానం నలుమూలలా క్లాసిక్ షాట్లతో అలరిస్తూ, పరుగుల వేగాన్ని తగ్గకుండా చూసుకున్నారు. ఓపెనింగ్ భాగస్వామ్యం బలంగా ఉండటంతో తర్వాత వచ్చిన బ్యాటర్లపై ఒత్తిడి తగ్గింది. రాజస్థాన్ బ్యాటర్ల ఆత్మవిశ్వాసం చూస్తుంటే, వారు ఈ మ్యాచ్‌ను ముందే ముగించాలని నిర్ణయించుకున్నట్లు కనిపించింది.

**మధ్య ఓవర్ల మాయాజాలం:**

**ఒత్తిడిని అధిగమించిన బ్యాటర్లు**

మధ్య ఓవర్లలో పంజాబ్ స్పిన్నర్లు వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పాలని ప్రయత్నించారు. వరుసగా రెండు వికెట్లు కోల్పోయిన తరుణంలో రాజస్థాన్ కాస్త ఆందోళన చెందినా, క్రీజులోకి వచ్చిన సీనియర్ ఆటగాళ్లు సంయమనంతో ఆడి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఒత్తిడి సమయాల్లో అనవసరపు షాట్లకు పోకుండా, సింగిల్స్ మరియు డబుల్స్‌తో స్ట్రైక్ రొటేట్ చేస్తూ లక్ష్యం వైపు అడుగులు వేశారు. పంజాబ్ ఫీల్డర్లు చేసిన చిన్న చిన్న తప్పులు రాజస్థాన్‌కు వరంగా మారాయి. బ్యాటింగ్ మరియు రన్నింగ్ బిట్వీన్ ద వికెట్స్ విషయంలో రాజస్థాన్ ప్రదర్శించిన సమన్వయం వారి వృత్తి నైపుణ్యాన్ని చాటిచెప్పింది.

**విజయ దుందుభి:**

**పాయింట్ల పట్టికలో రాయల్స్ హవా**

చివరి ఓవర్లలో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ, రాజస్థాన్ బ్యాటర్లు ప్రశాంతతను కోల్పోకుండా లక్ష్యాన్ని చేరుకున్నారు. 6 వికెట్ల తేడాతో లభించిన ఈ విజయం రాజస్థాన్ శిబిరంలో పండుగ వాతావరణాన్ని నింపింది. పంజాబ్ కింగ్స్ వరుస విజయాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా, రాజస్థాన్ తాము కూడా టైటిల్ రేసులో ఉన్నామని గట్టిగా చాటిచెప్పింది. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో రాజస్థాన్ అగ్రస్థానానికి చేరువవడమే కాకుండా, జట్టులోని ఆటగాళ్లలో నూతనోత్సాహాన్ని నింపింది. రాజస్థాన్ రాయల్స్ ప్రదర్శించిన ఈ ఆల్‌రౌండ్ ప్రదర్శన ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక మరపురాని ఘట్టంగా నిలిచిపోనుంది.

రాజస్థాన్ రాయల్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్
పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ (మొదట బ్యాటింగ్):
మొత్తం స్కోరు: 186/6 (20 ఓవర్లు)

**ప్రధాన బ్యాటర్లు:**

ప్రభ్‌సిమ్రాన్ సింగ్: 65 పరుగులు (42 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు)
సామ్ కరన్: 42 పరుగులు (28 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్సర్)
లియామ్ లివింగ్‌స్టోన్: 28 పరుగులు (15 బంతుల్లో)

రాజస్థాన్ బౌలింగ్ గణాంకాలు:
యుజ్వేంద్ర చాహల్: 4 ఓవర్లు 28 పరుగులు 3 వికెట్లు
ట్రెంట్ బౌల్ట్: 4 ఓవర్లు 32 పరుగులు 2 వికెట్లు
సందీప్ శర్మ: 4 ఓవర్లు 35 పరుగులు 1 వికెట్

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ (లక్ష్య ఛేదన):
మొత్తం స్కోరు: 189/4 (19.1 ఓవర్లు)

**ప్రధాన బ్యాటర్లు:**

యశస్వి జైస్వాల్: 72 పరుగులు (45 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లు)
సంజూ శాంసన్: 48 పరుగులు (32 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లు)
రియాన్ పరాగ్: 35 పరుగులు (20 బంతుల్లో నాటౌట్)

**పంజాబ్ బౌలింగ్ గణాంకాలు:**

అర్ష్‌దీప్ సింగ్: 4 ఓవర్లు 38 పరుగులు 2 వికెట్లు
కగిసో రబడా: 4 ఓవర్లు 34 పరుగులు 1 వికెట్
రాహుల్ చాహర్: 3.1 ఓవర్లు 31 పరుగులు 1 వికెట్

**ముఖ్యమైన విశేషాలు:**

ఫలితం: రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.
ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్: యశస్వి జైస్వాల్ (అద్భుతమైన హాఫ్ సెంచరీకి గాను).
టర్నింగ్ పాయింట్: చాహల్ వేసిన 16వ ఓవర్, అందులో కేవలం 4 పరుగులు ఇచ్చి 2 కీలక వికెట్లు తీయడం మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పింది.
వేదిక: సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం, జైపూర్.

ఈ విజయం ద్వారా రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది, అదే సమయంలో పంజాబ్ కింగ్స్ యొక్క వరుస 4 విజయాల జైత్రయాత్రకు బ్రేక్ పడింది.

# డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

## హనుమకొండ జిల్లా కాంగ్రెస్ మొదటి పీఏసీ సమావేశం

**మహా వరంగల్ బ్యూరో;** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ డిసిసి కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన మొదటి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం అత్యంత కీలకంగా సాగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, హుజూరాబాద్ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్, టీపీసీసీ జెనరల్ సెక్రెటరీ దుద్దీల్ల శ్రీను బాబు, కార్పొరేటర్, జీడబ్ల్యూఎంసి ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ మహిళా అధ్యక్షురాలు బంక సరళ, ఆర్ జి పిఆర్ఎస్ అధ్యక్షులు శనిగరం సుధాకర్, సేవాదళ్ ఛైర్మన్ బొచ్చు చందర్, వోబీసీ సెల్ ఛైర్మన్ బొమ్మతి విక్రమ్ పాల్గొన్నారు.

**సమావేశంలోని ప్రధాన అంశాలు నిర్ణయాలు**

**సంస్థాగత నిర్మాణం విస్తరణ**

పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా చర్చించారు. నిర్ణీత గడువులోగా జిల్లా, మండల కమిటీల నియామకాలను పూర్తి చేయాలని తీర్మానించారు. ప్రతి యూనిట్‌కు ఒక అధ్యక్షుడిని నియమించడం ద్వారా బాధ్యతలను వికేంద్రీకరించాలని నిర్ణయించారు.

**బీఎల్ఏ-2 సమగ్ర నిర్మాణం**

ఎన్నికల్లో విజయం బూత్ స్థాయిలోనే ఖరారవుతుంది. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్ఏ2 బూత్ లెవల్ ఏజెంట్స్ నియామకాలను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని ఓటర్ల జాబితా పరిశీలన నుండి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వరకు వీరే మన సైన్యంగా ఉండాలని నిర్ణయించారు.



**పంచాయతీ, వార్డు కమిటీల వేగవంతం**

గ్రామ పంచాయతీ మరియు మున్సిపల్ వార్డు కమిటీలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నిర్ణయించారు..

**మండల అధ్యక్షుల ప్రమోషన్లు మార్పులు**

మండల అధ్యక్షులు పనితీరు ఆధారంగా మండల అధ్యక్షుల ప్రమోషన్లు అలాగే అవసరమైన చోట మార్పుల గురించి చర్చించారు. డీసీసీ నామినేషన్ మార్గదర్శకాలపై స్పష్టతనిచ్చారు.

**డీసీసీ కార్యాలయ భూమి కేటాయింపు**

జిల్లా కాంగ్రెస్ పార్టీకి సొంత భవనం నిర్మించుకునేందుకు అవసరమైన భూమి కేటాయింపు ప్రక్రియపై ప్రత్యేకంగా చర్చించారు.

**రైతుల సంక్షేమం, యూఎస్‌డీఎల్**

యూఎస్‌డీఎల్ అంశం దాని వల్ల రైతులపై పడే ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా పార్టీ అండగా ఉంటుందని, రైతులకు ఏ చిన్న కష్టం వచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు అండగా నిలబడాలని చర్చించారు. అనంతరం ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ కీలక తీర్మానాలు చేశారు.

పాఠశాలల్లో అల్పాహారం, మిడ్‌డే మీల్స్' పథకం ముఖ్యమంత్రి అల్పాహార పథకం గురించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, విద్యా సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఈ పథకం ఒక మైలురాయిగా నిలిచిందని, నిరుపేద విద్యార్థులు ఉదయం ఖాళీ కడుపుతో పాఠశాలకు రాకుండా చూడటం, వారిలో పోషకాహార లోపాన్ని నివారించడం జరిగిందని, దీని వల్ల పాఠశాలల్లో విద్యార్థుల హాజరు గణనీయంగా పెరిగిందని, పోషకవిలువలతో కూడిన అల్పాహారం అందడం వల్ల విద్యార్థుల్లో నేర్చుకునే సామర్థ్యం ఏకాగ్రత ఏర్పడిందని, మిడ్‌డే మీల్స్ మధ్యాహ్న భోజనం నాణ్యతను పెంచుతూనే, ఉదయం పూట కూడా పౌష్టికాహారం అందించడంపై పీఏసీ సమావేశం హర్షం వ్యక్తం చేసింది.

**గిగ్ వర్కర్ల భద్రత - ప్రత్యేక చట్టం**

నేటి ఆధునిక కాలంలో డెలివరీ ఏజెంట్లు జొమాటో స్విగ్గి, డ్యానొజో క్యాబ్ డ్రైవర్లు ఓలా ఉబర్ వంటి 'గిగ్ వర్కర్ల' పాత్ర పెరిగింది. వీరి కోసం ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పీఏసీ ముఖ్యమంత్రిని అభినందిస్తూ వీరు ఏ సంస్థలోనూ శాశ్వత ఉద్యోగులు కాదు అలాగే పని ఆధారంగా సంపాదిస్తారు. వీరికి గతంలో ఎటువంటి సామాజిక భద్రత ఉండేది కాదు. ప్రమాద బీమా మరియు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించటం, పని గంటలకు తగిన ప్రతిఫలం అందేలా చట్టం రక్షణ కల్పిస్తుంది. వేతనాల నిలిపివేత లేదా వేధింపుల వంటి సమస్యలు ఎదురైనప్పుడు ఫిర్యాదు చేసేందుకు ఒక చట్టబద్ధమైన వేదిక దొరుకుతుంది. అసంఘటిత రంగ కార్మికుల కోసం ఇటువంటి చట్టం తీసుకురావడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తీర్మానించారు.

# వికలాంగులకు అండగా ప్రజా ప్రభుత్వం

- వికలాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం
- పాల్గొన్న హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**మహా వరంగల్ బ్యూరో;** వికలాంగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తెలంగాణ వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ హనుమకొండ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో వికలాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య , డీసీసీ అధ్యక్షులు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురికి దివ్యాంగుల రవాణా సౌలభ్యం కోసం అధునాతన స్కూటర్లను పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులు, యువతకు ఉపాధి, విద్యా అవకాశాల కోసం ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వికలాంగులు మనోధైర్యం కోల్పోకుండా సమాజంలో ఎవరిపైనా ఆధారపడకుండా, స్వయం సమృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. వారికి అవసరమైన బ్యాటరీ ట్రై సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు మరియు ఇతర ఉపకరణాలను నాణ్యతతో అందిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను దివ్యాంగులకు చేరువ చేస్తామని భరోసా ఇచ్చారు. సమర్థవంతమైన పాలనతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**మహా వరంగల్ బ్యూరో;** గీసుగొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం యందు మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశంలో అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలలో ప్రధానంగా మంచినీరు, విద్యుత్, డ్రైనేజ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న మెరుగైన వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సంక్షేమ పథకాలలో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ అధికారులు ప్రజలు సమన్వయంతో పూర్తి చేయాలని తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా ప్రత్యేక దృష్టి సాధించాలి. గ్రామాలలోని ఓహెచ్ ఎస్సార్ వాటర్ ట్యాంకులలో మిషన్ భగీరథ, రా వాటర్ కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటి వృధా అని అరికట్టాలని, నీటిని సక్రమంగా వాడుకుంటామని ప్రతిజ్ఞ చేయించాలన్నారు. అలాగే గుడుంబా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్ సంబంధించిన ఏవైనా అసంఘీక కార్యక్రమాలు జరిగినట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి అన్నారు. రేషన్ షాపులలో బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు.



## సీఐ విశ్వేశ్వర్ కు సీపి చేతుల మీదుగా ప్రశంసా పత్రం

**ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్న సిఐ విశ్వేశ్వర్**

**మహా వరంగల్ బ్యూరో;** విధుల్లో నిబద్ధత, పొగాకు ఉత్పత్తుల నియంత్రణ పై గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. వరంగల్ జిల్లా గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తన విధుల్లో చూపిన ప్రతిభకు గాను వరంగల్ పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన క్రైమ్ రివ్యూ సమావేశంలో ఈ బహుమతిని అందజేశారు. గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్కా, తంబాకు వంటి నిషేధిత పొగాకు ఉత్పత్తుల అమ్మకాల పై సీఐ విశ్వేశ్వర్ ఉక్కు పాదం మోపి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, చిన్నపిల్లలు వ్యసనాల బారిన పడకుండా ఆయన చేపట్టిన చర్యలు, అవగాహన కార్యక్రమాలను కమిషనర్ ప్రత్యేకంగా కొనియాడారు. ఈ సందర్భంగా కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. సీఐ విశ్వేశ్వర్ చూపిస్తున్న క్రమశిక్షణ, అంకితభావం ఇతర అధికారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజాసేవలో పోలీసులు ఇదే రకమైన నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలోని ఉన్నతాధికారుల తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ను పరామర్శించిన డాక్టర్ వన్నాల వెంకటరమణ



**మహా వరంగల్ బ్యూరో;** మాజీ ఎమ్మెల్యే, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు మార్తినేని ధర్మ రావు ను మంగళవారం బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ దంపతులు పరామర్శించారు. నర్సంపేట కు చెందిన ఆర్టీసీ కార్మికుడు, బస్ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య అనంతరం నర్సంపేట లో కేంద్ర సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ తో కలిసి ఈనెల 24 తేదీన ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎం. ధర్మారావు కు అకస్మాత్తుగా ఛాతీ నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురైనారు. మొదటగా హన్మకొండ లోని రోహిణి హాస్పిటల్ లో చికిత్స అందించిన అనంతరం హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న ఏఐజీ ఆసుపత్రిలో రెండు రోజులు ఐసీయూలో చికిత్స పొందిన అనంతరం సాధారణ రూమ్ కు తరలించిన విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ తో పాటు వారి సతీమణి డాక్టర్ పావన ఆసుపత్రికి వెళ్ళి ధర్మారావు ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన మొదటి రోజుతో పోల్చితే, నేటికి తన ఆరోగ్యం మెరుగుపడటం చూసి డాక్టర్ వన్నాల సంతృప్తి వ్యక్తం చేశారు. ధర్మ రావు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.



## శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు

**రజక కులస్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు**

**మహా వరంగల్ బ్యూరో;** ఉమ్మడి వరంగల్ జిల్లా రజక కుటుంబ సభ్యులచే నిర్వహించబడుతున్న శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా రజక కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ్ ఉత్సవంలో అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని శ్రీ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ధర్మకర్తలు రజక సోదరులు ఓరుగంటి పూర్ణ, పాలడుగుల ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. అమ్మవారి కృపకు పాత్రులై శ్రీ భద్రకాళి అమ్మవారు రజక కుటుంబాలపైన అమ్మవారి దీవెనలు ఉండాలని ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, రజక కార్పొరేటర్లు చీకటి శారద ఆనంద్, బస్వరాజు కుమారస్వామి, బస్వారాజు శిరీష శ్రీమాన్, బోగి సువర్ణ సురేష్‌లు వేడుకల్లో పాల్గొని అమ్మవారిని కోరుకున్నామని వారు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వం కొత్త రూల్స్

**రూ.50 వేల లావాదేవీల పై పాన్ కార్డ్ తప్పనిసరి**

**మహా వరంగల్ బ్యూరో;** ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం పాన్ కార్డ్ నిబంధనలలో భారీ మార్పులు చేసింది. ఇక పై రూ.50 వేలు దాటిన అన్ని లావాదేవీలకు పాన్ కార్డ్ తప్పనిసరి చేసింది.కారు, బైక్, బంగారం, భూమి, ఇల్లు కొనుగోలు, డీమ్యాట్ ఖాతా తెరవడం, మ్యూచువల్ ఫండ్స్, బాండ్లు, డిబెంచర్లలో పెట్టుబడులు, రూ.10 లక్షలకు మించిన నగదు డిపాజిట్లు, విత్ డ్రాలు, రూ.లక్ష దాటి చేసే సెక్యూరిటీ కొనుగోళ్లకు పాన్ తప్పనిసరి. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తుందని అలాగే ఫామ్ 60, 61 స్థానంలో ఫామ్ 97, 98 తీసుకొచ్చారు.

# ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ లోకి మాజీ జెడ్పిటిసి చేరిక

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టీపీసీసీ అధ్యక్షుడు**

**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల మాజీ జెడ్పిటిసి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రధాన అనుచరుడిగా ఎన్నో ఏండ్లుగా ప్రజలకు సేవలందించిన మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వర్ధన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఈ చేరిక కార్యక్రమం జరిగింది.వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సమక్షంలో, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మేడిశెట్టి రాములు కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని, అదే విశ్వాసం ఇతర పార్టీలకు చెందిన కీలక నాయకులను కూడా కాంగ్రెస్ వైపు ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు వంటి అనుభవజ్ఞులైన నాయకులు పార్టీలో చేరడం ద్వారా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, వర్ధన్నపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని అన్నారు. ప్రజల ఆశయాలను నెరవేర్చడం, ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజా సేవే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పేదల గూడు, నీడ కల, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అనంతరం వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ పర్వతగిరి మండలానికి చెందిన మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు కాంగ్రెస్ పార్టీలో చేరడం హర్షణీయమని, ఆయనకు పార్టీ సిద్ధాంతాలపై ఉన్న నమ్మకం, ప్రజా సేవ పట్ల ఉన్న నిబద్ధత పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని చెప్పారు. ఎన్నో ఏండ్లుగా ప్రజల మధ్య పనిచేసిన అనుభవం ఉన్న నాయకులు పార్టీలో చేరడం ద్వారా కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ జెండాను ప్రతి గ్రామంలో మరింత ఎగురవేయాలని, ప్రజల ఆశీర్వాదాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుదామని అన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, టిపిసిసి లీగల్ సెల్ వైస్ ఛైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, జిల్లా నాయకులు పిన్నింటి అనిల్ రావు, జాటోత్ శ్రీనివాస్ నాయక్, కరాటే ప్రభాకర్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# డీజీపీగా సీవీ ఆనంద్

## నియమిస్తూ ఉత్తర్వులు.. బహుముఖ ప్రజ్ఞాశాలి

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ దళానికి నూతన సర్వసైన్యాధ్యక్షుడిగా సీనియర్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ నియామకమయ్యారు. రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ)గా ఆయన మే 1వ తేదీన బాధ్యతలు చేపట్టనున్నారు. సుమారు 35 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో క్షేత్రస్థాయి నుంచి అత్యున్నత విభాగాల వరకు అన్నింటా తనదైన ముద్ర వేసిన ఆనంద్, ఇప్పుడు రాష్ట్ర పోలీస్ వ్యవస్థను సమర్థవంతంగా నడిపించేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్ మట్టిలోనే పుట్టి పెరిగి, ఇక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న అధికారి కావడంతో ఆయన నియామకంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

### విద్యార్థి దశ నుంచే టాపర్‌గా..

1968లో భాగ్యనగరంలో జన్మించిన సి.వి. ఆనంద్, విద్యార్థి దశ నుంచే అత్యంత ప్రతిభావంతుడిగా గుర్తింపు పొందారు. ప్రతిష్టాత్మక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో టాపర్‌గా నిలిచిన ఆయన, నిజాం కాలేజీ మరియు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించారు. చదువులో ఎంతటి ప్రతిభ చూపారో, కెరీర్ విషయంలోనూ అంతే పట్టుదల కనబరిచారు. కేవలం 22 ఏళ్ల వయసులోనే, అదీ తొలి ప్రయత్నంలోనే ఐపీఎస్‌కు ఎంపికై తన సత్తా చాటారు. వృత్తి పట్ల ఆయనకున్న అంకితభావానికి ఇది తొలి నిదర్శనం.

### సవాళ్లను ఎదుర్కొని సాహస పతకంతో..

కెరీర్ ఆరంభంలోనే వరంగల్, నిజామాబాద్ వంటి నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో పనిచేసిన ఆనంద్, శాంతి భద్రతల పరిరక్షణలో రాజీలేని పోరు సాగించారు. ప్రాణాలకు తెగించి నక్సలైట్లపై పోరాడిన ఆయన సాహసానికి గుర్తింపుగా ప్రభుత్వం 'ప్రెసిడెంట్స్ గ్యాలంట్రీ మెడల్' తో గౌరవించింది. శాంతిభద్రతల నిర్వహణలో ఎంత కఠినంగా ఉంటారో, ప్రజలకు ఉపయోగపడే సంస్కరణలు తీసుకురావడంలో అంతే ఉత్సాహం చూపుతారు. హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో నేడు మనం చూస్తున్న ఈచలానా , డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి కీలక తనిఖీలను కఠినంగా ప్రవేశపెట్టి వాహనదారుల్లో క్రమశిక్షణ తెచ్చింది ఆయనే.



### మహిళా భద్రత,టెక్నాలజీకి పెద్దపీట

సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో మహిళా భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. షీటీమ్స్, షీషటిల్స్ వంటి విప్లవాత్మక కార్యక్రమాలను బలోపేతం చేసి, నగరంలో మహిళలకు భరోసా కల్పించారు. అలాగే హైదరాబాద్ కమిషనర్‌గా పండుగలను అత్యంత ప్రశాంతంగా నిర్వహించి మెప్పించారు. ఆధునిక నేరాలను అరికట్టేందుకు టెక్నాలజీని వాడుకోవడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. డ్రగ్స్ నియంత్రణ కోసం 'హెచ్‌న్యూ' , సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయడం ఆయన దూరదృష్టికి అద్దం పడుతోంది. డ్రగ్స్ నియంత్రణలో ఆయన సాధించిన విజయాలకు గాను దుబాయ్‌లో జరిగిన వరల్డ్ పోలీస్ సమ్మిట్‌లో అంతర్జాతీయ పురస్కారం లభించడం గమనార్హం.

### బహుముఖ ప్రజ్ఞాశాలి.. క్రీడా స్ఫూర్తి ప్రదాత

కేవలం పోలీస్ శాఖకే పరిమితం కాకుండా, పౌర సరఫరాల విభాగంలోనూ ఆనంద్ అద్భుతాలు చేశారు. రేషన్ షాపుల్లో ఈపోస్ యంత్రాలను ప్రవేశపెట్టి అవినీతిని అరికట్టడం ద్వారా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలను ఆదా చేశారు. అలాగే కేంద్ర సర్వీసుల్లో సీఐఎస్ఎఫ్ అధికారిగా దేశవ్యాప్త విమానాశ్రయాల భద్రతను పర్యవేక్షించిన అనుభవం ఆయనకు ఉంది. వృత్తిపరంగా ఎంతటి బిజీగా ఉన్నా, ఆయన క్రీడలను ఎప్పుడూ వదిలిపెట్టలేదు. క్రికెట్‌లో రంజీ ట్రోఫీ స్థాయి వరకు ఆడిన ఆయన, 50 ఏళ్లు దాటినా నేటికీ మైదానంలో శతకాలతో అలరిస్తూ అత్యంత ఫిట్‌గా ఉంటున్నారు. టెన్నిస్, క్రికెట్ ఆడుతూ క్రీడా స్ఫూర్తితో సిబ్బందిని నడిపించడంలో ఆయన దిట్ట. రాష్ట్రపతి పోలీస్ పతక గ్రహీత అయిన సి.వి. ఆనంద్ సారథ్యంలో తెలంగాణ పోలీస్ వ్యవస్థ సరికొత్త శిఖరాలను అధిరోహించనుంది.

# మహిళా రిజర్వేషన్ల కోసం 'మహాయజ్ఞం'

- ప్రతిపక్షాల 'రెడ్ సిగ్నల్'ను దాటుకుని ముందుకు
- 40 ఏళ్ల ద్రోహానికి ముగింపు పలుకుతాం
- కాశీ-అయోధ్యలకు 'అమృత్ భారత్' వేగం
- వారణాసి-పుణె, అయోధ్య-ముంబయి రైళ్లకు పచ్చజెండా ఊపిన మోదీ

**ఢిల్లీ, మహా:** దేశ రాజకీయ యవనికపై మహిళల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా రిజర్వేషన్ల ప్రక్రియను ఒక పవిత్రమైన 'మహాయజ్ఞం'గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. వారణాసి వేదికగా మంగళవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, సాధారణ కుటుంబాలకు చెందిన మహిళలు అసెంబ్లీలు, పార్లమెంటులోకి అడుగుపెట్టడం ఇష్టం లేని కొన్ని శక్తులు దశాబ్దాలుగా ఈ బిల్లును అడ్డుకుంటున్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాశీ ఎంపీగా తన నియోజకవర్గ మాతృమూర్తుల ఆశీస్సులతో ఈ చట్టాన్ని అమలు చేసే వరకు విశ్రమించేది లేదని ఆయన మహిళలకు అభయమిచ్చారు. ఇదే సందర్భంలో ఆధ్యాత్మిక నగరాలైన కాశీ మరియు అయోధ్యలను మెట్రో నగరాలతో అనుసంధానిస్తూ రెండు నూతన 'అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్' రైళ్లను ప్రారంభించి, సామాన్యుడికి అత్యాధునిక ప్రయాణ సౌకర్యాలను చేరువ చేశారు.

**మహిళా రిజర్వేషన్ల సాధనే లక్ష్యం**

లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై ప్రధాని మోదీ అత్యంత భావోద్వేగంతో ప్రసంగించారు. ఈ చట్టాన్ని తీసుకురావడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంటే, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ వంటి పార్టీలు తమ కుటుంబ ప్రయోజనాల కోసం మహిళా శక్తిని అణగదొక్కాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. గత 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూ వస్తున్న ప్రతిపక్షాలు, ఇప్పుడు మళ్ళీ 'రెడ్ సిగ్నల్' చూపిస్తూ అడ్డంకులు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. దేశ సంక్షేమం కోసం మహిళలు చట్టసభల్లో కీలక పాత్ర పోషించాల్సిన సమయం ఆసన్నమైందని, ఎన్ని రాజకీయ ఆటంకాలు ఎదురైనా తన శాయశక్తులా కృషి చేసి రిజర్వేషన్ల హక్కును అమలు చేస్తానని ప్రధాని హామీ ఇచ్చారు.

**కుటుంబ రాజకీయాలపై నిప్పులు**

ప్రతిపక్షాల విమర్శలపై స్పందిస్తూ, రాజకీయాల్లో మహిళల ఎదుగుదల చూసి కొన్ని పార్టీలు భయపడుతున్నాయని ప్రధాని ఎద్దేవా చేశారు. బుజ్జగింపు రాజకీయాలు, కుటుంబ పాలనపై ఆధారపడే పార్టీలకు సాధారణ మహిళల సాధికారత మింగుడుపడటం లేదని విమర్శించారు. కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు మహిళా రిజర్వేషన్ల విషయంలో దేశానికి ద్రోహం చేశాయని, కేవలం ఓట్ల కోసమే వారు మహిళలను వాడుకుంటున్నారని ఆరోపించారు. తాను చేస్తున్న ఈ పోరాటం రాజకీయ పార్టీల కోసం కాదని, దేశంలోని కోట్లాది మంది సోదరీమణులు, కుమార్తెల ఉజ్వల భవిష్యత్తు కోసమేనని మోదీ స్పష్టం చేశారు. వారి మనోభావాలను గౌరవించకుండా అడ్డుకట్ట వేసే శక్తులకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**పట్టాలెక్కిన అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్**

వారణాసి పర్యటనలో భాగంగా ఉత్తరప్రదేశ్ మరియు మహారాష్ట్రల మధ్య రైలు అనుసంధానాన్ని పెంచుతూ ప్రధాని మోదీ రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. వారణాసి నుంచి పుణెకు, అయోధ్య నుంచి ముంబయికి పరుగులు తీయనున్న ఈ రైళ్లు సామాన్యులకు సైతం హైస్పీడ్ ప్రయాణ అనుభూతిని అందించనున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన ఈ రైళ్లలో మధ్యతరగతి ప్రయాణికులకు అనువైన సదుపాయాలు కల్పించడం విశేషం. ముంబయి, పుణె వంటి కీలక నగరాల నుంచి నేరుగా రైలు సౌకర్యం కల్పించడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడటమే కాకుండా, దక్షిణాది మరియు పశ్చిమ భారత ప్రజలకు ఉత్తర భారతంతో అనుసంధానత సులభతరం కానుందని రైల్వే వర్గాలు వెల్లడించాయి.

**ఆధ్యాత్మిక పర్యాటకానికి నూతన ఉత్తేజం**

కొత్తగా ప్రారంభించిన అమృత్ భారత్ రైళ్ల ద్వారా ఆధ్యాత్మిక పర్యాటక రంగం భారీగా పుంజుకోనుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. కాశీ విశ్వనాథ క్షేత్రాన్ని దర్శించుకునే పుణె భక్తులకు, అలాగే అయోధ్య రామ మందిరాన్ని సందర్శించాలనుకునే ముంబయి వాసులకు ఈ రైళ్లు వరప్రసాదంలా మారనున్నాయని పేర్కొన్నారు. కేవలం సంపన్నులకే కాకుండా, సామాన్యులకు కూడా గమ్యస్థానాలకు వేగంగా, సౌకర్యవంతంగా చేరుకునే అవకాశం కల్పించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపడుతున్న ఇలాంటి ప్రాజెక్టులు దేశ సాంస్కృతిక మరియు ఆర్థిక ఐక్యతను చాటిచెబుతాయని, రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా మరిన్ని అమృత్ భారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తామని ప్రధాని వివరించారు.

# గూగుల్ పట్నం విశాఖ

**మహా, ప్రత్యేకం: భావితరాల భవిష్యత్తును శాసించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మహాయుగానికి ఆంధ్రప్రదేశ్ సగర్వంగా వేదికవుతోంది. దశాబ్దాలుగా కేవలం అలల హోరును, ఉక్కు కర్మాగారాల సైరన్లను విన్న విశాఖపట్నం తీరం.. నేడు ప్రపంచ టెక్నాలజీ గుండె చప్పుడుగా మారబోతోంది. టెక్ దిగ్గజం గూగుల్ అక్షరాలా రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో, విశాఖ గడ్డపై నిర్మించనున్న 'గ్లోబల్ ఏఐ క్లౌడ్ డేటా సెంటర్' రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలోనే ఒక సువర్ణాధ్యాయం. ఇది కేవలం ఒక భవన నిర్మాణమో, లేదా కొన్ని వేల కోట్ల పెట్టుబడో కాదు.. ఇది నిరుద్యోగ యువత కలల సాకారానికి దొరికిన అక్షయ పాత్ర. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు, ఐటీ మంత్రి నారా లోకేష్ కార్యదక్షతకు నిలువెత్తు సాక్ష్యం ఈ ప్రాజెక్టు. సముద్ర గర్భం గుండా ఖండాలను కలిపే సబ్‌సీ డేటా గేట్‌వే నుంచి, రెండు లక్షల ఉద్యోగాల సృష్టి వరకు.. ఏపీని ప్రపంచ ఐటీ పటంలో అగ్రగామిగా నిలబెట్టబోతున్న ఈ డిజిటల్ విప్లవంపై మహా పత్రిక ప్రత్యేక కథనం.**

తూర్పు కనుమల సాక్షిగా, బంగాళాఖాతం సముద్ర కెరటాల హోరు మధ్య.. దశాబ్దాలుగా ఉక్కు కర్మాగారపు సైరన్లతో మార్మోగిన విశాఖపట్నం ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మహా విప్లవానికి సగర్వంగా స్వాగతం పలుకుతోంది. ఒకప్పుడు కేవలం పోర్ట్ సిటీగా, వాణిజ్య నౌకల రాకపోకలకు మాత్రమే పరిమితమైన ఈ 'సిటీ ఆఫ్ డెస్టినీ'.. నేడు ప్రపంచ సాంకేతిక యవనికపై అత్యంత శక్తివంతమైన 'గ్లోబల్ ఏఐ డేటా సిటీ'గా అవతరిస్తూ చరిత్ర గతిని మార్చే ఒక మహోజ్జ్వల ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ 28, 2026 - ఇది కేవలం ఆంధ్రప్రదేశ్ క్యాలెండర్‌పై ఒక తేదీ మాత్రమే కాదు, యావత్ భారతదేశ పారిశ్రామిక చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ మహాద్భుత సాంకేతిక వేకువజాము. ప్రపంచ టెక్నాలజీ భవిష్యత్తును శాసించే గ్లోబల్ దిగ్గజం 'గూగుల్' సంస్థ, మన రాష్ట్రంపై ఉంచిన అపారమైన విశ్వాసంతో అక్షరాలా రూ.1.35 లక్షల కోట్ల (సుమారు 15 బిలియన్ డాలర్ల) రికార్డు స్థాయి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో (ఎఫ్‌డీఐ) విశాఖ గడ్డపై ప్రతిష్ఠాత్మక 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మరియు క్లౌడ్ డేటా సెంటర్'కు అంకురార్పణ చేయడం రాష్ట్ర భవిష్యత్తు ముఖచిత్రాన్నే సమూలంగా మార్చేస్తోంది. సముద్ర గర్భం గుండా ఖండాలను కలిపే ఫైబర్ ఆప్టిక్ కేబుళ్ల సబ్‌సీ గేట్‌వే విప్లవం నుంచి, గ్లోబల్ ఏఐ ఎకానమీలో అగ్రగామిగా ఎదిగే ప్రయాణం వరకు.. ఈ ప్రాజెక్టు ఒక అక్షయ పాత్రలా పరోక్ష, ప్రత్యక్ష మార్గాల్లో ఏకంగా రెండు లక్షల ఉపాధి అవకాశాలను సృష్టిస్తూ నిరుద్యోగ యువత ఇళ్లల్లో కోటి కాంతులు నింపబోతోంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, రాష్ట్ర ఐటీ మరియు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అలుపెరగని కార్యదక్షత కలగలిసి రాష్ట్రంలో ఒక సువర్ణ యుగానికి తెరతీశాయి. ఒకప్పుడు విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునరుద్ధరిస్తూ, కేంద్రంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ అండదండలతో ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకుపోతోందనడానికి ఈ మహా ప్రాజెక్టే నిలువెత్తు సాక్ష్యం. 2047 'వికసిత్ భారత్' మహా స్వప్నానికి తిరుగులేని పునాది రాయిగా, యావత్ ఆసియా ఖండపు డిజిటల్ భవిష్యత్తుకు బలమైన దిక్సూచిగా మారనున్న ఈ ఏఐ డేటా సెంటర్ ఆవిష్కరణ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ ఐటీ పటంలో అగ్రభాగాన నిలబెడుతున్న ఒక అపూర్వ, చారిత్రాత్మక పారిశ్రామిక విజయం!*

### రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో మారుతున్న ఏపీ ముఖచిత్రం

ప్రపంచ దేశాలు ఆర్థిక మాంద్యంతో సతమతమవుతున్న ప్రస్తుత తరుణంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రం అంతర్జాతీయ పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రపంచ టెక్ దిగ్గజం 'గూగుల్' సంస్థ అక్షరాలా రూ.1.35 లక్షల కోట్ల (సుమారు 15 బిలియన్ డాలర్ల) అంచనా వ్యయంతో విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ ఏఐ డేటా సెంటర్ రాష్ట్ర పారిశ్రామిక రంగానికి అక్షయ పాత్రలా మారింది. దేశంలోనే అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా (ఎఫ్‌డీఐ) రికార్డు సృష్టించిన ఈ ప్రాజెక్టు కేవలం ఒక భవన సముదాయం మాత్రమే కాదు. ఇది రాష్ట్ర సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్నే సమూలంగా మార్చేయబోతున్న ఒక బృహత్తర ఆర్థిక యంత్రం. ఇంతటి భారీ పెట్టుబడి రావడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దశ, దిశ పూర్తిగా మారబోతోందన్నది నిర్వివాదాంశం.

### డిజిటల్ విప్లవానికి అంకురార్పణ



విశాఖ శివార్లలో జరిగిన ఈ మహా క్రతువు రాష్ట్ర పరిపాలనా దార్శనికతకు, బహుళజాతి సంస్థల సాంకేతిక నైపుణ్యానికి అద్దం పట్టింది. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, గూగుల్ క్లౌడ్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే తదితర ప్రముఖుల చేతుల మీదుగా జరిగిన ఈ శంకుస్థాపన మహోత్సవం భవిష్యత్ తరాలకు ఒక గొప్ప భరోసాను ఇచ్చింది. ప్రభుత్వ విధానాలు పారదర్శకంగా ఉంటే, నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ప్రపంచ స్థాయి సంస్థలు వాటంతట అవే తరలివస్తాయనడానికి ఈ కార్యక్రమమే సజీవ సాక్ష్యం. మంత్రి లోకేష్, బికాస్ కోలే ఒకే వేదిక పంచుకుని భవిష్యత్తు ప్రణాళికలను ఆవిష్కరించిన తీరు సభికులలో మరియు యావత్ రాష్ట్ర ప్రజానీకంలో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపింది.

### వికసిత్ భారత్ 2047 మహా స్వప్నానికి పునాది రాయి

ఒక దేశ పురోగతి కేవలం ఆయుధ సంపదతోనో, భారీ డ్యామ్‌లతోనో కొలవబడే రోజులు కనుమరుగయ్యాయి. రాబోయే దశాబ్దాలలో ప్రపంచ భౌగోళిక ఆర్థిక ముఖచిత్రాన్ని పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మాత్రమే శాసించబోతోంది. ఈ సత్యాన్ని ముందుగానే పసిగట్టి, 2047 నాటికి భారతదేశాన్ని ఒక అగ్రశ్రేణి అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) తీర్చిదిద్దాలన్న జాతీయ లక్ష్య సాధనకు విశాఖపట్నంలో నిర్మిస్తున్న ఈ గూగుల్ డేటా సెంటర్ ఒక అత్యంత దృఢమైన పునాది రాయి లాంటిదని గూగుల్ ప్రతినిధులు ఉద్ఘాటించారు. జాతీయ స్థాయిలో టెక్నాలజీ స్వయం సమృద్ధి సాధించాలంటే విశాఖ లాంటి మహా నగరాల్లో ఇలాంటి గ్లోబల్ డేటా సెంటర్లు ఎంతో అవసరమని, భారత ఆర్థిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే దిక్సూచిగా ఈ ప్రాజెక్టు నిలుస్తుందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

### డిజిటల్ ట్రేడ్ రూట్‌గా మారనున్న తూర్పు తీరం

సాధారణంగా సముద్ర తీరం అనగానే వాణిజ్య నౌకల రాకపోకలు, పోర్ట్ ద్వారా జరిగే సరుకు రవాణా మాత్రమే గుర్తుకువస్తాయి. కానీ విశాఖపట్నం తీరం ఇప్పుడు కంటికి కనిపించని, కానీ ప్రపంచ గమనాన్ని నిర్దేశించే అత్యంత సంక్లిష్టమైన ఇంటర్నేషనల్ డేటా బదిలీకి ప్రధాన నాడీకేంద్రంగా మారుతోంది. సముద్ర గర్భం గుండా వేల కిలోమీటర్ల మేర ఖండాలను కలుపుతూ సాగే అత్యాధునిక ఫైబర్ ఆప్టిక్ కేబుల్ నెట్‌వర్క్‌కు విశాఖపట్నం ఇకపై ఒక అతిపెద్ద ల్యాండింగ్ స్టేషన్‌గా అవతరించబోతోంది. దీనివల్ల భవిష్యత్తులో సాంప్రదాయ నౌకాయాన మార్గాలు అత్యంత వేగవంతమైన డిజిటల్ ట్రేడ్ రూట్లుగా రూపాంతరం చెందుతాయి. ఇది భౌగోళిక సరిహద్దులను చెరిపేస్తూ భారతదేశపు ఇంటర్నెట్ బ్యాక్‌బోన్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లే ఒక అపూర్వ సాంకేతిక మహాఘట్టం.

### అదానీ కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రాలతో నయా అధ్యాయం

విశాఖ నగరంలో రూపుదిద్దుకుంటున్న ఈ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులో గూగుల్ ఒంటరిగా అడుగులు వేయడం లేదు. భారతీయ టెలికాం, ఇన్‌ఫ్రా దిగ్గజాలు అదానీ కనెక్స్ మరియు ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రాలు గూగుల్‌కు సంపూర్ణ వ్యూహాత్మక మద్దతు పలుకుతున్నాయి. డేటా సెంటర్ నిర్మాణంలో అత్యంత క్లిష్టమైన పర్యావరణ హిత శీతలీకరణ వ్యవస్థలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, అల్ట్రాలో లేటెన్సీ ఫైబర్ కనెక్టివిటీ కల్పనలో ఈ సంస్థల భాగస్వామ్యం అమూల్యమైనది. బహుళజాతి సంస్థ అయిన గూగుల్ తో మన దేశీయ కార్పొరేట్ దిగ్గజాలు చేతులు కలపడం వల్ల భారతీయ డేటా భద్రతలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఈ మూడు అగ్రశ్రేణి సంస్థల కలయిక ద్వారా డిజిటల్ రంగంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనే పటిష్టమైన ఇకోసిస్టం విశాఖ వేదికగా తయారవుతోంది.

### ఖండాలను కలుపుతున్న ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్

భారతదేశ ఇంటర్నెట్ అవసరాలను, అంతర్జాతీయ డేటా ట్రాఫిక్‌ను ఇప్పటివరకు కేవలం ముంబై, చెన్నై నగరాల్లోని సబ్‌సీ గేట్‌వేలు (సముద్ర గర్భ ఇంటర్నెట్ కేబుల్ ల్యాండింగ్ పాయింట్లు) మాత్రమే భరిస్తూ వచ్చాయి. ఈ రెండు మెట్రో నగరాలపై ఉన్న విపరీతమైన భారాన్ని తగ్గించేందుకు ఇప్పుడు ఆ ప్రతిష్ఠాత్మక జాబితాలోకి విశాఖపట్నం సగర్వంగా ప్రవేశించింది. దేశంలోని మరే ఇతర ప్రాంతంలో నెట్‌వర్క్ అంతరాయం ఏర్పడినా, విశాఖపట్నం నుండి ఆ లోటును తక్షణం భర్తీ చేసే విధంగా సరికొత్త ఫైబర్ ఆప్టిక్ లైన్లు విశాఖ తీరాన్ని అమెరికా, యూరప్, సింగపూర్ వంటి అంతర్జాతీయ మార్కెట్లతో మిల్లీ సెకన్ల వ్యవధిలో అనుసంధానం చేయబోతున్నాయి. దీనివల్ల భారతీయ ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు విశాఖపట్నం అతిపెద్ద ప్రత్యామ్నాయ గేట్‌వేగా మారుతుంది.

### అంతర్జాతీయ స్థాయి డేటా రక్షణకు అభేద్యమైన కోటగా విశాఖ



అంతర్జాతీయ స్థాయిలో డేటా భద్రతకు ముప్పు వాటిల్లుతున్న ప్రస్తుత తరుణంలో, సైబర్ సెక్యూరిటీ అనేది ప్రతి దేశానికి అత్యంత ప్రాధాన్యతా అంశంగా మారింది. అమెరికా, యూరప్ లాంటి దేశాలతో అత్యంత సురక్షితమైన వాతావరణంలో డేటాను బదిలీ చేసే సామర్థ్యం విశాఖలోని ఈ అడ్వాన్స్‌డ్ ఏఐ డేటా సెంటర్‌కు ఉంటుంది. ఇక్కడ ఏర్పాటు చేయబోయే అత్యంత అత్యాధునిక నెట్‌వర్కింగ్ ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీ వల్ల, హ్యాకర్ల బారిన పడకుండా భారతీయ పౌరుల, పరిశ్రమల డేటా సురక్షితంగా ఉంటుంది. సైబర్ భద్రత, అడ్వాన్స్‌డ్ క్లౌడ్ రంగాల్లో విశాఖపట్నం ఇకపై ఆసియా ఖండానికే ఒక రోల్ మోడల్‌గా నిలబడబోతోందన్నది అక్షర సత్యం. ఇది దేశ డిజిటల్ సార్వభౌమాధికారాన్ని కాపాడే ఒక అభేద్యమైన కోటగా రూపుదిద్దుకోనుంది.

### డబుల్ ఇంజిన్ సర్కార్ వేగం

విశాఖపట్నం సభలో ఐటీ మంత్రి నారా లోకేష్ చేసిన ప్రసంగం రాష్ట్ర పరిపాలనా వేగాన్ని కళ్ళకు కట్టింది. కేంద్రంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌కు రాష్ట్ర ప్రభుత్వ దార్శనికత తోడై ఇప్పుడు ఏపీలో 'డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' నడుస్తోందని ఆయన సగర్వంగా ప్రకటించారు. ఒకప్పుడు దేశంలో ఎక్కడైనా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (సులభతర వ్యాపార వాణిజ్య విధానం) గురించి మాత్రమే మాట్లాడేవారని, కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (వ్యాపార అనుమతుల్లో అసాధారణ వేగం) సాకారం అవుతోందని ఆయన తేల్చిచెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఏళ్ల తరబడి ఫైళ్లలోనే మగ్గిపోయే భారీ ప్రాజెక్టులు ఇక్కడ మాత్రం కేవలం 13 నెలల రికార్డు సమయంలోనే శంకుస్థాపన స్థాయికి రావడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి తిరుగులేని నిదర్శనం.

### దేశవ్యాప్త పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే

2019 నుంచి 2024 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చవిచూసిన పారిశ్రామిక విధ్వంసం నుంచి కోలుకుని, నేడు దేశానికే ఆదర్శంగా నిలిచే స్థాయికి ఎదగడం ఒక చారిత్రక పరిణామం. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో దేశవ్యాప్తంగా వస్తున్న మొత్తం పెట్టుబడులలో అక్షరాలా 25 శాతం కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వస్తుండటం సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్ర భవిష్యత్తుపై గ్లోబల్ ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకానికి మంత్రి లోకేష్ వెల్లడించిన ఈ గణాంకాలే పక్కా నిదర్శనం. గత ఐదేళ్ల చీకటి రోజులను పారద్రోలి, రాష్ట్రాన్ని పునరుద్ధరించడానికే ప్రజలు ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి చారిత్రాత్మక మెజారిటీని కట్టబెట్టారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని లోకేష్ వివరించారు.

### గ్లోబల్ ఇన్వెస్టర్లకు నమ్మకంగా చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్

ఆర్సెలార్ మిట్టల్, రిలయన్స్, మరియు ఇప్పుడు గూగుల్ వంటి ప్రపంచస్థాయి ప్రాజెక్టులు రాష్ట్రానికి బారులు తీరడం వెనుక ఒకే ఒక బలమైన కారణం ఉంది. అది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ట్రాక్ రికార్డ్. నాడు రాళ్లగుట్టల మధ్య సైబరాబాద్‌ను సృష్టించి నేటి తెలంగాణ ఆర్థిక మూలాలకు ఆయన ఎలా పునాది వేశారో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇన్వెస్టర్లందరికీ తెలుసు. అదే దార్శనికతతో ఇప్పుడు విశాఖలో అద్భుతాలు సృష్టిస్తారన్న నమ్మకమే ఈ లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీరామరక్షగా మారింది. కేవలం రాయితీలు ఇస్తే పరిశ్రమలు రావు, నాయకుడి బ్రాండ్ ఇమేజ్, వారి విజన్ పై ఉన్న నమ్మకమే పెట్టుబడులను ఆకర్షిస్తుందనడానికి విశాఖ డేటా సెంటర్ మరొక సజీవ ఉదాహరణ. చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్ గ్లోబల్ ఇన్వెస్టర్లకు ఒక అభయారణ్యంలా మారింది.

### యువతకు భవితనిచ్చే 'గూగుల్'

ఈ చారిత్రక వేదికపై మంత్రి లోకేష్ రాష్ట్ర ప్రతిపక్ష పార్టీ అనుసరించిన విధ్వంసకర రాజకీయాలపై నిప్పులు చెరిగారు. విశాఖ గూగుల్ ప్రాజెక్టు ఏపీకి రాకుండా అడ్డుకోవడానికి కొందరు కోర్టుల్లో కేసులు వేసి పైశాచిక ఆనందం పొందాలని చూశారని ఆయన మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వానిది యువతకు భవిష్యత్తును ఇచ్చే 'గూగుల్' అభివృద్ధి పంథా అయితే, ప్రతిపక్ష పార్టీది రక్తం పారించే 'గొడ్డలి' సంస్కృతి అని ఆయన చేసిన పోలిక సభలో ప్రకంపనలు సృష్టించింది. ఇంతటి విధ్వంసకర మనస్తత్వం ఉన్న ప్రతిపక్ష నేతలు, చివరికి ఏపీకి వస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక గూగుల్ ప్రాజెక్టు క్రెడిట్ కూడా తామే తీసుకోవాలని సి.సి.డి (కాఫీ డే) రోగుల్లా ప్రయాస పడుతున్నారని ఆయన ఎద్దేవా చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి నిరోధకులకు ఈ ప్రాజెక్టు ఒక చెంపపెట్టు లాంటిదని ఆయన కుండబద్దలు కొట్టారు.

## పదివేల మంది మహిళలకు 'నారీ శక్తి'గా మారనున్న గూగుల్ సాధికారత

ఈ ప్రాజెక్టులో అత్యంత ఆకర్షణీయమైన, ఉదాత్తమైన అంశం మహిళా సాధికారత. టెక్నాలజీ అనేది ఏసీ గదుల్లో ఉండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకే కాదు, గడప దాటని గ్రామీణ మహిళలకు కూడా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇస్తుందని ఈ ప్రాజెక్టు నిరూపించబోతోంది. 'నారీ శక్తి' కార్యక్రమం కింద విశాఖ, పరిసర ప్రాంతాలకు చెందిన పది వేల మందికి పైగా మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ టూల్స్ వినియోగంపై సాంకేతిక, వ్యాపార శిక్షణ అందించి వారిని మైక్రో ఎంట్రప్రెన్యూర్స్ గా (సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా) తీర్చిదిద్దనున్నారు. ఇంటి దగ్గరే ఉంటూ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా వ్యాపారం చేసుకునే మెళుకువలను గూగుల్ నిపుణులు వీరికి నేర్పిస్తారు. ఇది మహిళల ఆర్థిక స్థితిగతులను సమూలంగా మార్చే ఒక సైలెంట్ రివల్యూషన్‌కు కేంద్ర బిందువు కాబోతోంది.

## స్థానిక యువతకు అడ్వాన్స్‌డ్ శిక్షణ

సాధారణంగా బహుళజాతి సంస్థలు అనగానే లాభాలు, షేర్ మార్కెట్ విలువలు మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ గూగుల్ సంస్థ స్థానిక మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. మారుతున్న టెక్నాలజీ యుగానికి అనుగుణంగా విశాఖ యువతను గ్లోబల్ సిటిజన్స్‌గా మార్చేందుకు కంకణం కట్టుకుంది. స్థానిక యువతకు అడ్వాన్స్‌డ్ క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్తు సాంకేతికతలపై ఉచిత మరియు సర్టిఫైడ్ శిక్షణా కార్యక్రమాలను గూగుల్ స్వయంగా నిర్వహించనుంది. ఇలాంటి కౌశలాభివృద్ధి కార్యక్రమాల ద్వారా స్థానిక యువతకు కేవలం ఈ డేటా సెంటర్‌లోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ భద్రత లభిస్తుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్)కి అసలైన అర్థం చెబుతూ గూగుల్ తీసుకుంటున్న ఈ చర్యలు సర్వత్రా ప్రశంసలు అందుకుంటున్నాయి.

## రెండు లక్షల ఉద్యోగాల వెల్లువ

రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వానికి గూగుల్ ప్రాజెక్టు ఒక బ్రహ్మాస్త్రం లాంటిది. ఒక గిగావాట్ సామర్థ్యంతో నిర్మితమవుతున్న ఈ హైపర్‌స్కేల్ ఏఐ ఎనేబుల్డ్ క్లౌడ్ డేటా సెంటర్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏకంగా రెండు లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయని అంచనా వేస్తున్నారు. నిర్మాణం, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్ మరియు సేవా రంగాలకు ఈ ప్రాజెక్టు ఊహించని బూస్ట్ ఇస్తుంది. నిర్మాణ దశలోనే సుమారు పాతిక వేల మందికి ఉపాధి లభించడం ఈ ప్రాంత ప్రజల కొనుగోలు శక్తిని, జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచుతుంది. మొత్తంగా రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషిలో విశాఖ గూగుల్ డేటా సెంటర్ ఒక మైలురాయిగా నిలిచిపోయి, యువత పాలిట ఒక కల్పవృక్షంలా మారబోతోంది.

## ఆర్థిక స్థిరత్వానికి ఆయువుపట్టుగా ఎకో-ఫ్రెండ్లీ డేటా సెంటర్

భారీ పరిశ్రమలు వస్తున్నాయంటే స్థానికులు తమ భూములు, నీరు, గాలి ఎక్కడ కలుషితం అవుతాయోనని భయపడే పరిస్థితి ఉంటుంది. కానీ విశాఖపట్నంలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ ఈ అపోహలన్నింటినీ పటాపంచలు చేసింది. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ వందల ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ సెంటర్‌ను అత్యంత పర్యావరణ హితంగా (ఎకో-ఫ్రెండ్లీ) డిజైన్ చేశారు. డేటా సెంటర్ల నిర్వహణకు సర్వర్లను చల్లబర్చడానికి లక్షల గ్యాలన్ల నీటిని వినియోగిస్తారు, అయితే గూగుల్ సంస్థ విశాఖలో అత్యాధునిక 'గ్రీన్ టెక్నాలజీ'ని ఉపయోగించబోతోంది. ఉపయోగించిన ప్రతి బొట్టు నీటిని రీసైకిల్ చేస్తూ, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిర్మిస్తున్న ఈ మహా కట్టడం నిజమైన పారిశ్రామిక విప్లవానికి, స్థానిక ఆర్థిక స్థిరత్వానికి ఆయువుపట్టుగా నిలవనుంది.

## మొదటి ట్రిలియన్ డాలర్ ఎకనామీ రీజియన్‌గా ఉత్తరాంధ్ర

రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి చెబుతున్న ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని విధానానికి కట్టుబడి ఉంటూనే, అభివృద్ధి వికేంద్రీకరణను ఎలా సాధించవచ్చో ఈ ప్రాజెక్టు ద్వారా ఆచరణాత్మకంగా చూపించింది. పరిపాలన ఒకే చోట ఉన్నప్పటికీ, పారిశ్రామిక అభివృద్ధిని క్లస్టర్ బేస్డ్ మోడల్ ద్వారా రాష్ట్ర నలుమూలలా విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగానే ఉత్తరాంధ్రకు గుండెకాయ లాంటి విశాఖను ఏఐ మరియు ఐటీ రాజధానిగా తీర్చిదిద్దుతున్నారు. గూగుల్ లాంటి మహా సంస్థల రాకతో విశాఖపట్నం భవిష్యత్తులో మొదటి ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్‌గా ఎదగడానికి మార్గం సుగమమైంది. కేవలం సాఫ్ట్‌వేర్ పార్కులు మాత్రమే కాకుండా, ఈ మల్టీ-గిగావాట్ ఇకోసిస్టం ద్వారా విశాఖ నగరం ఉత్తరాంధ్ర ఆర్థిక స్వరూపాన్నే సమూలంగా మార్చేయబోతోంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## న్యూ ట్రాన్స్ మిషన్ లైన్లు, ఆధునిక ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ ఏర్పాటు

ఇంత పెద్ద ప్రాజెక్టుకు నిరంతరాయ విద్యుత్ అవసరం కాబట్టి, దానివల్ల స్థానిక గృహ అవసరాలకు కరెంటు కోతలు వస్తాయన్న భయాలకు గూగుల్ సంస్థ పూర్తి స్థాయిలో చెక్ పెట్టింది. గూగుల్ ఆధ్వర్యంలో ఇక్కడ సరికొత్త న్యూ ట్రాన్స్‌మిషన్ లైన్లు (విద్యుత్ సరఫరా మార్గాలు) మరియు భారీ ఎనర్జీ స్టోరేజి సిస్టమ్స్ (ఇంధన నిల్వ కేంద్రాలు) ఏర్పాటు కాబోతున్నాయి. దీని వల్ల డేటా సెంటర్‌కు మాత్రమే కాకుండా, విశాఖపట్నంలోని వివిధ నివాస ప్రాంతాలకు మరియు ఇతర పరిశ్రమలకు కూడా విద్యుత్ సరఫరాలో అద్భుతమైన స్థిరత్వం ఏర్పడుతుంది. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, మరియు స్థానిక ప్రజలతో మమేకమై సాగే అభివృద్ధి.. ఈ మూడు మూలస్థంభాలపై విశాఖ గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణం వేగంగా ముందుకు సాగుతోంది.





## జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల పర్యటన

- మామునూరు ఎయిర్‌పోర్ట్ కు ప్రత్యేక డిజైన్
- మామునూరు ఎయిర్‌పోర్ట్ స్థల పరిశీలిన



**మహా వరంగల్ బ్యూరో;** ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రెండు రోజుల పర్యటనలో భాగంగా వరంగల్ జిల్లాలో పర్యటించారు.ఈ బృందంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ,అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందంఈడీ ఎస్.కె. గుప్తా, జై గౌరవ్ చౌదరి, జేజీఎం బాలేందర్ కుమార్ తివారి, కేజీఎం గోపాలకృష్ణ తో కలిసి మామునూరు విమానాశ్రయానికి ప్రత్యేక డిజైన్ రూపకల్పనలో భాగంగా మంగళవారం మామునూరు ఎయిర్‌పోర్ట్ స్థలాన్ని పరిశీలించారు.పర్యటనలో భాగంగా పద్మకోటలోని కీర్తి తోరణం, ఏకశిల గుట్టలోని స్వయంభూ దేవాలయం, రాతి మట్టి కట్టడాలను సందర్శించారు.కాకతీయుల శిల్పకళా వైభవాన్ని తిలకించిన అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను కూడా పరిశీలించారు.ఈ సందర్శనలో సంబంధిత శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు.

# నిరుపేదలకు సంజీవని... సేవలు ప్రశంసనీయం

- సిబ్బంది కొరతతో రోగులకు ఇబ్బందులు
- వందమంది నర్సులు అవసరం... ఇరవై మందితోనే సేవలు
- మధ్యాహ్నం తర్వాత వైద్య సేవల్లో మందగమనం
- శిశు విభాగంలో పర్యవేక్షణ లోటు




**కుషాయిగూడ, మహా :** మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రి నిరుపేదలకు ఆపన్నహస్తంగా నిలుస్తోంది. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రతిరోజూ వందల సంఖ్యలో రోగులు ఇక్కడికి తరలివచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అయినప్పటికీ, ఇక్కడ అందుతున్న సేవలు ప్రైవేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోకుండా ఉన్నాయని రోగులు అభిప్రాయపడుతున్నారు.ఉదయం వేళల్లో ఆసుపత్రి కార్యకలాపాలు చురుకుగా సాగుతాయి. ఔట్ పేషంట్ విభాగంలోనే రోజుకు 500 మందికి పైగా రోగులు చికిత్స పొందుతున్నట్లు సమాచారం. వైద్యులు సమయానికి హాజరై రోగులను పరిశీలిస్తూ, అవసరమైన పరీక్షలు సూచిస్తూ, మందులు అందిస్తున్నారు. ప్రసూతి విభాగంలో రోజుకు 10-15 ప్రసవాలు జరుగుతుండగా, శిశు విభాగంలోనూ అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయి. అత్యవసర కేసులు వచ్చినప్పుడు వెంటనే స్పందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే, ఈ సేవల వెనుక ఉన్న సిబ్బంది కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రికి కనీసం వందమంది నర్సులు అవసరం ఉన్నప్పటికీ, ప్రస్తుతం కేవలం ఇరవై మందితోనే నిర్వహణ కొనసాగుతోంది. ఒక నర్సు ఒకేసారి పలువురు రోగులను చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రోగుల పట్ల పూర్తిస్థాయి శ్రద్ధ చూపడం కష్టమవుతోందని ఆరోగ్య సిబ్బందే చెబుతున్నారు.మధ్యాహ్నం రెండు గంటల తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. చాలా మంది వైద్యులు విధులు ముగించుకుని వెళ్లిపోవడం, కొద్దిమంది మాత్రమే మిగలడం వల్ల రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అత్యవసరంగా వచ్చిన రోగులు కూడా సరైన సమయంలో వైద్యులను సంప్రదించలేక ఇబ్బందులు పడుతున్నారు. శిశు విభాగంలో పరిస్థితి ప్రత్యేకంగా ఆందోళన కలిగిస్తోంది. జాండీస్‌తో బాధపడుతున్న చిన్నారులకు ఫోటోథెరపీ చికిత్స అందిస్తున్నప్పటికీ, ఆ సమయంలో నిరంతర పర్యవేక్షణ అవసరం ఉంటుంది. కానీ సిబ్బంది కొరత కారణంగా పిల్లల దగ్గర నర్సులు ఎప్పుడూ ఉండడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిన్నారుల భద్రతపై తల్లిదండ్రుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.అదేవిధంగా, గర్భిణీల సంరక్షణలో కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రసవానికి ముందు, తర్వాత అవసరమైన పర్యవేక్షణ అందకపోవడం, అవసరమైన సమయంలో నర్సులు అందుబాటులో లేకపోవడం వల్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మందులు, ఇంజెక్షన్లు ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో రోగుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, పడకల సంఖ్య పరిమితంగా ఉండటం వల్ల చాలామంది నేలపై లేదా బయట వేచి ఉండాల్సి వస్తోంది. ల్యాబ్, స్కానింగ్, ఎక్స్‌రే వంటి విభాగాల్లో కూడా సరిపడా సదుపాయాలు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో నిరుపేదలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఇక మౌలిక సదుపాయాల విషయంలో కూడా కొంత వెనుకబాటుతనం కనిపిస్తోంది. కొన్ని వార్డుల్లో ఫ్యాన్లు, లైటింగ్ సరిగా పనిచేయకపోవడం, శుభ్రతలో లోపాలు ఉండటం రోగులను అసౌకర్యానికి గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆసుపత్రి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

**ముఖ్యంగా:**

నర్సింగ్ సిబ్బందిని అత్యవసరంగా పెంచడం. మధ్యాహ్నం తర్వాత కూడా వైద్యులు అందుబాటులో ఉండేలా షిఫ్ట్ విధానం అమలు చేయడం. శిశు, ప్రసూతి విభాగాల్లో ప్రత్యేక పర్యవేక్షణ బలోపేతం. ల్యాబ్, స్కానింగ్ సదుపాయాల విస్తరణ. పడకల సంఖ్య పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి. చర్యలు తీసుకుంటే, మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రి జిల్లాలోనే ఆదర్శప్రాయమైన ప్రభుత్వ ఆసుపత్రిగా ఎదగగలదని ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# డ్రగ్స్ కు నో చెప్పండి..

## పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**మహా వరంగల్ బ్యూరో;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పిల్లల భద్రత రక్షణ, డ్రగ్స్‌కు నో చెప్పండి అనే అవగాహన కార్యక్రమం వర్ధన్నపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మున్సిపల్ చైర్ పర్సన్ పాలకుర్తి సారంగపాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తు అని, వారిని మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా ప్రభావిత మవుతాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని, వారి ప్రవర్తనలో మార్పులను గమనించి సమయానికి సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాలల రక్షణకు కట్టుబడి ఉండాలని ఆదేశించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రమాణం చేయించడంతో పాటు "డ్రగ్స్‌కు నో" సందేశంతో ర్యాలీ నిర్వహించారు. యువతకు మత్తు పదార్థాల ప్రమాదాలపై విపులంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ కమిషనర్ జోనా, ఎంపీడీఓ వెంకటరామణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఉమా, పోలీస్, విద్యాశాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# భార్యాభర్తల మధ్య కుటుంబ తగాదాలు

**ఇద్దరు పిల్లలతో సహా భార్య అదృశ్యం**

**కుషాయిగూడ, మహా :** భార్య భర్తల మధ్య కుటుంబ తగాదాలు చోటు చేసుకోగా మనస్థాపం చెందిన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ లోని బాలాజీ నగర్ చంద్రపురి కాలనీలో సఫావత్ రాజు భార్య జ్యోతి ఇద్దరు కుమారులు జస్వంత్ యశ్వంత్ తో కలిసి నివసిస్తున్నారు. అన్యోన్యంగా సాగుతున్న కుటుంబంలో ఇటీవల గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈనెల 24న రాత్రి భార్యాభర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా మనస్తాపం చెందిన జ్యోతి( 30) మరసటి రోజు ఇంట్లో చెప్పకుండా పిల్లలను తీసుకొని బయటికి వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికిన బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు భర్త రాజు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాయపోల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రంగారెడ్డి

- ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకే కొనుగోలు
- రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాం: సెక్రటరీ ధనరాజ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాచకొండమైలారం పిఏసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారంలోని రాచకొండమైలారం ప్రాథమిక వ్యవసాయ సహకారం రైతు సంఘం ఆధ్వర్యంలో రాయపోల్ గ్రామంలో నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్నికి ముఖ్యఅతిథిగా హాజరైన, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఏఎంసి చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, రాయపోల్ గ్రామ సర్పంచ్ అచ్చన్న మమత శ్రీశైలంతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులను రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. రైతుల ఎవరు కూడా దళారులను మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో, ధాన్యానికి నిర్ణయించిన గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని రైతులకు సూచించారు. బయట వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, బయట వ్యక్తులకు అమ్ముకొని నష్టాల పాలు కావద్దని, ప్రభుత్వం సూచించిన కేంద్రాలలో దాన్యం అమ్ముకోవడం ద్వారా లాభాలు పొందవచ్చని, ఎమ్మెల్యే రంగారెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని, పిఏసిఎస్ సెక్రటరీ ధనరాజుకు, ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, తూకంలో అవకతవకలు జరగకుండా చూడాలని ఎమ్మెల్యే రంగారెడ్డి, అధికారులకు సూచించారు. పిఏసిఎస్ సెక్రటరీ ధనరాజ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లో డబ్బులు వాళ్ళ అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు కావలసిన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అలాగే రైతులకు కావలసిన గోనెసంచులు కూడా సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. రైతులు పండించిన చివరి గింజ వరకు, పిఏసిఎస్ సెంటర్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని ధనరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్లు, పిఏసిఎస్ అధికారులు, గ్రామ వార్డు సభ్యులు, రైతులు పలువురు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల ప్రచారంలో సమాచార శాఖను తీర్చిదిద్దాలి

**రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం**



**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలంటే సమాచార పౌర సంబంధాల శాఖ తన ప్రచార శైలిని మరింత ఆధునీకరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం అన్నారు. ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డిని మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టీఎస్జేయూ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది.ఈ సందర్భంగా నారగౌని పురుషోత్తం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సమాచార శాఖది కీలక పాత్ర అని నొక్కి చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి, ప్రచార విభాగాలను బలోపేతం చేయడం ద్వారా పథకాల లబ్ధిని ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని ఆయన ఆకాంక్షించారు. అనుభవజ్ఞులైన ముకుంద రెడ్డి నేతృత్వంలో శాఖ కొత్త పుంతలు తొక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం పై కూడా కమిషనర్ సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ముత్యం ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొని కమిషనర్ ను ఘనంగా సన్మానించారు.

# మే డేను విజయవంతం చేయండి

- నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసేవరకు పోరాటం ఆగదు
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు



**రాజేంద్రనగర్, మహా :** నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు పోరాటం ఆగదు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే ను ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు తెలిపారు. శంషాబాద్ జోన్ పరిధిలోసిపిఐ మండల కార్యదర్శి నర్సిగిరి ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ కూడలి వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలిసి మేడే పోస్టరు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు కార్మిక వర్గం పోరాటాలు నిర్వహించాలని కార్మిక వర్గానికి చంద్రయ్య పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లాలో లక్షలాది మంది కార్మికులు ఉన్నారు, వారందరి తరపున ఏఐటీయూసీ పోరాడాలని ఆయన తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అన్ని రంగాల కార్మికులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణ ఉద్యమ కళాకారుల సమస్యలు పరిష్కరిస్తాం



**కుషాయిగూడ, మహా :** తెలంగాణ ఉద్యమ కళాకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ నిరుద్యోగ కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి త్వరలోనే పరిష్కార మార్గం చూపేందుకు కృషి చేస్తానన్నారు. బాషా సాంస్కృతిక శాఖ సలహాదారు దరువు అంజన్న మాట్లాడుతూ ఉద్యమ కళాకారుల ఆవేదన న్యాయబద్ధమైనదేనని, ప్రజా ప్రభుత్వం వారి కోరికలను తప్పక నెరవేర్చుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.సమావేశంలో సంఘం రాష్ట్ర చైర్మన్ అనువోజ్ వెంకటేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్, ఉపాధ్యక్షులు జువాజి ప్రవీణ్, పేరాల యాదగిరి, కొంద్ర కుమార్, సలీం, నర్మదా, పెద్దపల్లి పుష్ప, పరకాల రమ, శారద రాజేశ్వరి, పిన్నింటి దాసు తదితరులు పాల్గొన్నారు.

# "మల్ రెడ్డి వెంటనే మా ప్రయాణం": మమత శ్రీశైలం

- కాంగ్రెస్‌లో చేరిన రాయపోల్ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం
- నియోజకవర్గం అభివృద్ధి ఎమ్మెల్యే మల్ రెడ్డితోనే సాధ్యం - రాయపోల్ సర్పంచ్
- రాయపోల్ గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తా... ఎమ్మెల్యే రంగన్న



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా రాయపోల్ గ్రామ సర్పంచ్ మమత శ్రీశైలం, బీఆర్ఎస్ పార్టీని వీడి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్ రెడ్డి రంగారెడ్డి నాయకత్వం, అభివృద్ధి పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసంతో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారు. "మల్ రెడ్డి వెంటనే మా ప్రయాణం" అంటూ రాయపోల్ గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత గౌరవం ఉంటుందని తెలిపారు. రాయపోల్ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం చేరికతో స్థానికంగా కాంగ్రెస్ మరింత బలోపేతం అయ్యిందని నాయకులు అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పట్ల పెరుగుతున్న మద్దతు రాబోయే రోజుల్లో నియోజకవర్గ రాజకీయాల్లో కీలక మార్పులకు నాంది పలుకుతుందని అన్నారు.

**ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి...**

మల్ రెడ్డి వెంటనే మా ప్రయాణం" అంటూ రాయపోల్ గ్రామ సర్పంచ్ అన్నారు. ఎమ్మెల్యే రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని, రాయపోల్ గ్రామ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం తెలిపారు. మునుముందు ఎమ్మెల్యే రంగారెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ కర్ణాకర్, మాజీ జెడ్పిటిసి మహిపాల్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, రాయపోల్ మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈసీ శేఖర్ మామ, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగారెడ్డి, మహేందర్ గౌడ్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పులుగు గిరుకబావి సురేఖ నియామకం



**కుషాయిగూడ, మహా :** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పులుగు గిరకబావి సురేఖను నియమించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆత్మకూరి కాంతి కిరణ్ ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్ రావు, సురేఖకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కాంతి కిరణ్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ఆదర్శాలకు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. నీతి, నిజాయితీతో క్రమశిక్షణ పాటిస్తూ సహచర కార్యకర్తలు, పార్టీ కమిటీలతో సమన్వయంగా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.తన నియామకానికి సహకరించిన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లారెడ్డికి సురేఖ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో 30వ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరం...




**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే చివరి వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిహెచ్ఎంసి గేమింగ్ ఇన్స్పెక్టర్ ప్రకటనలో తెలిపారు. ఆరు సంవత్సరాల నుంచి 16 సంవత్సరాలు వరకు యువతి యువకులకు క్రికెట్, వాలీబాల్, షటిల్, స్కేటింగ్, మార్షల్ ఆర్ట్స్, ఇండోర్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## జిహెచ్ఎంసి నిర్లక్ష్యానికి స్విమ్మింగ్ పూల్ పరాకాష్ట

- కోట్లు ఖర్చుపెట్టిన క్రీడాకారులకు నోచుకొని వైనం..
- ఐదు సంవత్సరాలుగా నడుస్తున్న పనులు
- మధ్యలోనే వదిలిపెట్టి కాంట్రాక్టర్ జంప్



**రాజేంద్రనగర్, మహా ;** జిహెచ్ఎంసి నిర్లక్ష్యానికి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లోని స్విమ్మింగ్ పూల్ పరాకాష్టగా మారింది. కోట్లు ఖర్చుపెట్టి నిర్మాణం తలపెట్టిన స్విమ్మింగ్ పూల్ పూర్తికాకముందే మధ్యలోనే వదిలిపెట్టి వెళ్లిన కాంట్రాక్టర్, జిహెచ్ఎంసి మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో 2004లో కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కు శిలాఫలకం చేశారు. 2004 నుంచి 2026 వరకు సుమారు 16 నుంచి 20 కోట్లు నిదులను కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి ప్రభుత్వాలు కేటాయించాయి. అదనంగా మరో రెండు కోట్లు స్విమ్మింగ్ పూల్ కోసం బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు మంజూరు అయ్యాయి. ఐదు సంవత్సరాల నుంచి నిరంతరంగా స్విమ్మింగ్ పూల్ పనులు జరుగుతూ ఉన్నాయి. బిఆర్ఎస్ ప్రభుత్వంలోని హడావిడిగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించారు. స్విమ్మింగ్ పూల్ తుదిమెరుగులు దిద్దుకొని ప్రారంభానికి సిద్ధం అనే లోపే స్విమ్మింగ్ పూల్ లో లీకేజీ మొదలై వాటర్ ట్యాంకర్లతో పోసిన నీరంతా లీకేజ్ ద్వారా బయటకు వెళ్లిపోయాయి. గత మూడు సంవత్సరాల నుంచి ఈ వేసవికాలంలో ప్రారంభిస్తున్నాము, అంటున్నారే తప్ప ప్రారంభానికి స్విమ్మింగ్ పూల్ నోచుకోవడంలేదు. తొందరగా స్విమ్మింగ్ పూల్ ని ప్రారంభించి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలన్నారు. జిహెచ్ఎంసి అధికారులు ప్రజా ప్రతినిధులు సిమ్మింగ్ పూల్ పై చోరువ చూపి పనులు పూర్తి చేయాలనిడిమాండ్ చేస్తున్నారు.

# కుషాయిగూడలో 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ప్రతిష్టకు సిద్ధం



**కుషాయిగూడ, మహా :** హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో, కుషాయిగూడ బజరంగ్ దళ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో నిర్మిస్తున్న 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మే 1, శుక్రవారం వైశాఖ శుద్ధ పౌర్ణమి, స్వాతి నక్షత్ర సమూహూర్తంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారీ హనుమాన్ విగ్రహంతో పాటు మూలవిరాట్ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి, వినాయక విగ్రహాల యంత్ర మంత్ర ప్రాణ ప్రతిష్ట నిర్వహించనున్నారు. 28 మంగళవారం సాయంత్రం దేవత మూర్తుల గ్రామోత్సవం ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. 29వ తేదీన ఉదయం, సాయంత్రం హోమాలు, దేవతామూర్తుల జలాధివాసం, 30వ తేదీ గురువారం ఉదయం, సాయంత్రం హోమాలు, ధాన్యాధివాసం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్ట కార్యక్రమాలను శ్రీ హంపి వీరుపాక్ష విద్యారణ్య భారతి స్వామి, శ్రీ యోగానంద సరస్వతి స్వామి (అదిలాబాద్), శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, శ్రీ చిట్టి పెద్ది రామశర్మ గారి ఆధ్వర్యంలో వైదిక బ్రాహ్మణులు యంత్ర మంత్ర ప్రాణ ప్రతిష్టగా నిర్వహించనున్నారు. విగ్రహ విశేషాలు ఆకట్టుకుంటున్నాయి. 54 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ విగ్రహ కిరీటాన్ని రాజస్థాన్ జైపూర్ నుంచి తెప్పించిన జర్కాన్ రత్నంతో అలంకరించారు. స్వామివారి సహజ నేత్రాలను (మనిషి కళ్లలా కనిపించే విధంగా) తమిళనాడు నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చారు. హృదయ భాగంలో అయోధ్య బాల రాముని దివ్యమంగళ స్వరూపాన్ని ప్రతిష్టించారు. ఆలయ గర్భగుడిలో మూలవిరాట్ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామితో పాటు నవహనుమాన్ మూర్తులను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ముఖద్వారం ఇరువైపులా ఒకవైపు శివపార్వతులు, మరోవైపు లక్ష్మీనారాయణ మూర్తులను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమాల్లో హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి, కుషాయిగూడ బజరంగ్ దళ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. నిర్మాణ పనులకు సహకరించిన ప్రతి ఒక్కరికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే ప్రతిష్ట పూజ కార్యక్రమాలను విజయవంతం చేయాలని భక్తులను కోరారు.

## పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

- విద్యార్థులు భవిష్యత్తుతో చెలగాటం వద్దు..!
- ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్
- మంగళపల్లి సాగర్ హైవేపై ఏబీవీపీ ధర్నా
- భారీగా ట్రాఫిక్ జామ్ పోలీసుల రంగ ప్రవేశం
- ఆందోళన కారులను అదుపు చేసి: ట్రాఫిక్ క్లియర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శంషాబాద్ విభాగ్, రంగారెడ్డి జిల్లా, వీరపట్నం మంగళపల్లి చౌరస్తాలో, ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి, సాగర్ హైవేపై బైఠాయించి ధర్నా చేయడం జరిగింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామై రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళన కారులను అదుపులోకి తీసుకొని ట్రాఫిక్ సమస్యను తొలగించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ, గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్ లో 10,000 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా, నిమ్మకు నీరెత్తినట్టు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు. హై కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని పదేపదే కౌంటర్ దాఖలు చేయాలని చెప్పిన అసలు వినకుండా, ఫ్లీజ్ రియాబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర పనిలో ప్రభుత్వం ఉన్నదని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విద్యార్థుల దగ్గరే వసూలు చేయాలని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు, హై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం బాధాకరం అని అన్నారు. ఇలాగైతే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, పై చదువులు చదవలేని విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోవాల్సి వస్తుందని, ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలి కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తాం అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్రపల్లి మహేందర్, ఢిల్లీ భానుప్రసాద్, స్టేట్ టెక్నికల్ సెల్ కో కోనూర్ చింతల గుణవంత్ రెడ్డి, స్టేట్ వనవాసి కో కన్వీనర్ మునవత్ రాజేష్, ఎస్ఎఫ్ఎస్ స్టేట్ కో కన్వీనర్ పుప్పాల ఆదర్శ్, స్టేట్ సోషల్ మీడియా కో కన్వీనర్ వెంకటరమణ, విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ దంతజు జ్యోతి ప్రసాద్, నగర కార్యదర్శి వినయ్, గణ, రామ్, చరణ్, తిరుపతి, శివ, నాని, ప్రణీత్, రోహిత్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను పోరాటాలను ఆపలేరు

**అరెస్టులను ఖండించిన ఎల్లంకి మహేష్**

**వలిగొండ, మహా:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం జరుగు హలో విద్యార్థి చలో సీఎం ఇంటికి కార్యక్రమానికి తరలి వెళ్ళనున్న విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ అన్నారు అరెస్టు అయినా వారిలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మారోజు నరసిమాచారి కార్యదర్శి సుద్ధాల సాయికుమార్ లను అక్రమ అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు.

## వలిగొండలో పెట్రోల్ డీజిల్ కొరత

**ఇబ్బంది పడ్డ వాహనదారులు**

**వలిగొండ, మహా:** వలిగొండ మండల కేంద్రంలో భారత్ పెట్రోలియం బంకులో మంగళవారం మధ్యాహ్నం పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడింది ప్రభుత్వం ఒకవైపు పెట్రోల్ డీజిల్ కొరత లేదంటూనే మండలములో పెట్రోల్ కొరత ఏర్పడడం వెంటనే వలిగొండ మండల ప్రజలకు పెట్రోల్ కొరత లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు



**సివిల్ సప్లై అధికారి బాలమణి వివరణ**

దాదాపుగా డీజిల్ పెట్రోల్ కొరత లేకుండా చూస్తామని ఇప్పటివరకు ఎలాంటి కొరత లేదని వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు

## కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ

**ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదాద్రి భువనగిరి,మహా:** సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారుమంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఆలేరు నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలలో కళ్యాణ లక్ష్మి ముఖ్యమైన పథకమని అన్నారుఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కుమార్తెల వివాహ సమయంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నదని చెప్పారు.అలాగే ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు సమన్వయంతో కొనసాగుతున్నాయని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారులబ్ధిదారులు ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, మహిళా లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**పోలీసులకు,విలేకరులకు తెల్ల టోపిలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారుఈ సందర్భంగా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచే లక్ష్యంతో నిర్మించనున్న సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసి, రైతులకు మద్దతుగా PACS ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ చర్యల ద్వారా స్థానిక రైతులకు తక్షణ సౌకర్యాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.అలాగే వీరారెడ్డిపల్లి, తిరుమలపూర్, తుర్కపల్లి, ముల్కలపల్లి గ్రామాల్లో కూడా PACS వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు, రైతుల పంటలకు న్యాయమైన మద్దతు ధరలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.అనంతరం విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి, విలేకరులకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రక్షణార్థం తెల్ల టోపీలను పంపిణీ చేశారు. ప్రజల సేవలో నిమగ్నమైన వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమాల అనంతరం దయ్యంబండ తండాలో జరిగిన గ్రామ దేవతల పండుగ వేడుకల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ గౌరవం ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, అధికారులు, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సుశ్రుత గ్రామీణ వైద్యుల ఫస్ట్ ఎయిడ్ సంఘం 9వ వార్షికోత్సవం పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలత్య

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఆర్ ఎం పి డాక్టర్ల 9వ వార్షికోత్సవ మహాసభలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆర్ ఎం పి & పి ఎం పి డాక్టర్ల సేవలను ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందించడంలో RMP డాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.గ్రామీణ వైద్యుల హక్కులు సాధించుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.RMP & PMPలకు అధికారిక గుర్తింపు ఇవ్వాలని, వారి భవిష్యత్తు భద్రత కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య రంగంలో శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో గ్రామీణ వైద్యుల బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు.ప్రభుత్వం తీసుకొస్తున్న ఆరోగ్య పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో RMP డాక్టర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. RMP & PMP సంఘాల నాయకులు స్థానిక ప్రజా ప్రతినిధులు

**వైద్యులు మరియు సిబ్బంది**

పెద్ద సంఖ్యలో గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు. ఈ మహాసభలో గ్రామీణ వైద్యుల సమస్యలు, హక్కులు, గుర్తింపు అంశాలపై చర్చలు జరిగాయి. ఎమ్మెల్యే గారు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## పెట్రోల్ డిజిల్ కొరత లేకుండా చూడాలి

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా పెట్రోలియం సేల్స్ అధికారులతో (IOC/BPC/HPC/NAYARA) మరియు పెట్రోల్ బంకుల నిర్వాహకులతో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సేల్స్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. డిడి కట్టిన బంకు యజమానులకు వెంటనే ఆయిల్ సరఫరా చేయాలని, పెట్రోల్ మరియు డీజిల్ కొరత లేకుండా చూడాలన్నారు వరిధాన్య కొనుగోళ్లు జరుగుతున్నందున, రైతులకు మరియు ధాన్యం రవాణా వాహనాలకు, హార్వెస్టర్లకు, అత్యవసర సేవ వాహనాలు, నిత్యవసర సరుకు రవాణా వాహనాలను ఇబ్బంది కలగకుండా సరిపడా పెట్రోల్ / డీజిల్ నిల్వలు ఉండేలా చూసుకోవాలని



సూచించారు. ఆయిల్ సంస్థల వద్ద అవసరానికి సరిపడ పెట్రోలు, డీజిల్ నిల్వలున్నాయని, ఆయిల్ సరఫరాలోనూ ఇబ్బందులేవని, వదంతులు నమ్మి అవసరానికి మించి పెట్రోలు కొనవద్దని తెలిపారు .ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి,జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో హిందూ సమ్మేళనం కరపత్రాల ఆవిష్కరణ

**భద్రాచలం మహా :** భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో మే 3 ఆదివారం జరగనున్న "హిందూ సమ్మేళనం" కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు దశలవారీగా వేగం పుంజుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నేడు భద్రాచలం పట్టణంలో హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ గారి నివాసంలో కరపత్రాలను ఆవిష్కరించి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ గారు మాట్లాడుతూ, హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించడం మరియు ధార్మిక విలువలను బలపరచడం ఈ సమ్మేళన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే నిర్వహించిన సమన్వయ సమావేశాల ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించామని, ఇప్పుడు కరపత్రాల విడుదలతో గ్రామాలు, వార్డుల స్థాయిలో



ప్రచారాన్ని విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ మహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం భద్రాచలం నగర ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.వి. సుబ్రహ్మణ్యం, కోశాధికారి నాగభూషణ శాస్త్రి, గోపి కిషోర్, ఎ. శ్రీనివాస రెడ్డి, జె. శ్రీనివాస రావు, శ్రీమతి అన్నపూర్ణ, సిద్ధార్థ, కుంజా సంతోష్ తదితరులు పాల్గొని తమ మద్దతును తెలియజేశారు.

## కలకలం రేపిన నకిలీ బంగారు నగల రుణం







- 7లక్షల 50 వేలు హాంఫట్
- పట్వారిగూడెం టిజివిబి లో ఘటన
- విధులకు గైర్హాజరైన బ్యాంకు మేనేజర్
- ఎలా జరిగిందో తెలియదంటున్న ఉద్యోగ సిబ్బంది
- మేనేజర్ తీరుపై అనుమానాలు వ్యక్తపరుస్తున్న స్థానికులు
- పోలీసులకు ఫిర్యాదు చేయకపోడంపై పలు అనుమానాలు

**దమ్మపేట ,మహా :** నకిలీ బంగారు ఆభరణాలు బ్యాంకు లో తాకట్టు పెట్టి ఏకంగా రూ.7లక్షల 50వేల రూపాయలు కాజేసిన ఘటనపై మండల వ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ ఘటన గత రెండు రోజులుగా వివిద ప్రసార మాధ్యమాలలో కథనాలు వస్తుండటంతో ఆనోట ,ఈ నోట పలు చర్చలకు దారితీసింది. ఈ విషయంపై పూర్తి సమాచారం సేకరించేందుకు 'మహా' పత్రిక మంగళవారం చేసిన ప్రయత్నం లో పలు అంశాలు వెలుగు చూశాయి. మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో ఉన్న తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు లో గత కొన్నిరోజుల క్రితం నకిలీ బంగారం తాకట్టు పై రూ.7.50 లక్షల వరకు ఓ వ్యక్తి కి రుణం ఇచ్చినట్లు స్థానికులు కొందరు ఆరోపిస్తున్నారు.ఈ విషయం ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలలోకి చేరాయి. మంగళవారం బ్యాంకుకు మేనేజర్ అసలు రాకపోవడంతో అక్కడి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అక్రమ బంగారు రుణం సంగతి వాస్తవంగానే జరిగే ఉండొచ్చుననే అనుమానాలు వ్యక్తం పరిచారు. బ్యాంకు లో క్యాషియర్ గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిని ఇదే విషయమై ప్రశ్నించగా , మాకే తెలియదని ,అటువంటప్పుడు మీడియా కు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదనే సమాధానంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అదీగాక పట్వారిగూడెం బ్యాంకు లో అతి తక్కువ సిబ్బంది ఉంటారని తెలిపారు.

### అంతా తానై :

సహజంగా బ్యాంకు లో మేనేజర్ తో పాటు ,అసిస్టెంట్ మేనేజర్ ,అకౌంటెంట్ ,క్యాషియర్ ,ఫీల్డ్ అసిస్టెంట్ ,క్లర్క్ ,ఆఫీస్ బాయ్ ,తదితరులు సిబ్బంది ఉంటారు. కానీ పట్వారిగూడెం బ్యాంకు లో అంతా తానై ,అంటే మేనేజర్ ,అకౌంటెంట్ ,అసిస్టెంట్ మేనేజర్ ,ఫీల్డ్ ఆఫీసర్ ఇలా అన్ని విభాగాల్లో మేనేజర్ ఒక్కరే కావడంతో నకిలీ బంగారు రుణం ఎలా జరిగి ఉంటుందనే విషయం తెలియడం లేదనే సమాధానాలు వినిపిస్తున్నాయి.

### గోల్డ్ అప్రైజర్ పాత్ర ఎంత ...?

ప్రతి బ్యాంక్ లో బంగారు రుణం పొందాలంటే సత్సంబంధ శాఖ లో కొన్ని నిబంధనలు తప్పనిసరిగా ఉంటాయి. వాటి పరిమితికి లోబడి మాత్రమే బంగారు రుణాలు వినియోగదారుల కు అందిస్తారు. ఐతే గోల్డ్ అప్రైజర్ చేయాల్సిన పనేమిటంటే , తాకట్టు కు వచ్చిన బంగారం సరైనదా...? నకిలీ దా...? వాటి తూకం ఎన్ని గ్రాముల కు వచ్చిందో మిల్లీ లలతో సహా బ్యాంకు మేనేజర్ కు తెలపాల్సి ఉంటుంది. అక్కడ ఎన్ని గ్రాములకు ఎంత మేరకు రుణాన్ని ఇవ్వొచ్చనే విషయం వినియోగదారునికి తెలియజేసి ,అనంతరం అతని ముందరనే తాకట్టు పెట్టిన బంగారం సీల్డ్ కవర్ లో లాకర్ లో ఉంచుతారు. ఇదంతా మేనేజర్ చేయాల్సిన పని. ఇంత పకడ్బందీగా జరిగే అంశంలో నకిలీ బంగారు ఆభరణాలు ఎలా వస్తాయో ,వచ్చాయో అర్థంగాని పరిస్థితి నెలకొంది.

### వాస్తవమా...? లేక పుకార్ల....?

మీడియా ప్రసారాలలో వస్తున్న కథనాలు ఏ మేరకు వాస్తవం అనేది సరైన ఆధారాలు ఎక్కడా కనిపించడం లేదు. ఐతే నిప్పు లేనిదే పొగ రాదనేది సామెత ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు బ్యాంకు మేనేజర్ విధులకు హాజరై ,సరైన వివరణ ఇవ్వాల్సి ఉండగా గైర్హాజరు కావడంతో పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇప్పటి వరకు ఈ అంశంపై స్థానికంగా ఉన్న పోలీసులకు ఫిర్యాదు గానీ ,సమాచారం గానీ ఇవ్వకపోవడంపై మరెన్నో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఏది ఏమైనా ఏకంగా రూ.7లక్షల .50 వేల రూపాయలు లోన్ ద్వారా అందించడమంటే సరైన ఆధారాలు లేకుండా సాధ్యపడే సాధారణ విషయం కాదు. కానీ స్కాం జరిగిందనే ఆరోపణలు వస్తున్న క్రమంలో పూర్తి భాధ్యత బ్రాంచి మేనేజర్ ,గోల్డ్ అప్రైజర్ లపైనే ఉంటుందనే విషయం అధికారులు తేల్చాల్సి ఉంది. పూర్తి సమాచారం కోసం మేనేజర్ నోరువిప్పితేనే తెలిసే అవకాశం ఉంది.

## రోగులకు మెరుగ్తైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం పోచంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి)ను కలెక్టర్ సందర్శించారు, అక్కడి వైద్య సేవలను గురించి పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా పి హెచ్ సి లోని ప్రతి విభాగాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల్లో ఎక్కడా చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలన్నారు. ప్రతిరోజూ ఆసుపత్రికి ఎంత మంది అవుట్ పేషెంట్ వస్తున్నారనీ, వచ్చే వారు ఎలాంటి వ్యాధులతో వస్తున్నార అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అవసరమైన అన్ని రకాల మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా ఎల్లప్పుడూ నిల్వలు ఉండేలా చూడాలని సూచించారు. గత నెలలో పి హెచ్ సి పరిధిలో జరిగిన ప్రసవాల వివరాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అందులో ప్రభుత్వ



ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు జరిగాయనీ అడిగి తెలుసుకున్నారు.గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రసవాలు కూడా ప్రభుత్వం ఆసుపత్రిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏఎన్ఎంల పాత్ర చాలా కీలకమని, వారు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించి గర్భిణీలను ఆసుపత్రికి తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగడం ద్వారా తల్లిశిశు ఆరోగ్యం మెరుగుపడుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. మనోహర్, డిప్యూటీ డిఎంహెచ్ ఓ యశోద, వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ కొరతపై బంకు యజమానులు బాధ్యతగా వ్యవహరించాలి

**సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు**



**బూర్గంపహాడ్ మహా** బూర్గంపాడు మండలంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ బంకుల్లో ఆయిల్ కొరత తీవ్రమైందని, ఈ పరిస్థితిలో కొందరు వ్యక్తులు క్యాన్లు, పీపాలు తీసుకువచ్చి పెద్ద మొత్తంలో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లడం వల్ల సాధారణ ప్రజలకు ఇంధనం దొరకని పరిస్థితి ఏర్పడుతోందన్నారు.బైక్‌లతో వచ్చిన సాధారణ ప్రజలకు పెట్రోల్ అందకుండా పోతే వారి దైనందిన జీవనం తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరికీ సమానంగా ఇంధనం అందేలా బంకు యజమానులు చర్యలు తీసుకోవాలని కోరారు.రెండు లీటర్ల చొప్పున మాత్రమే పెట్రోల్ బైక్‌లకు ఇవ్వాలని, ట్రాక్టర్లు, లారీలు వంటి వాహనాలకు అవసరానికి అనుగుణంగా పరిమితి విధిస్తూ 20 లీటర్ల వరకు మాత్రమే డీజిల్ ఇవ్వాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా ఎక్కువ మందికి ఇంధనం అందే అవకాశం ఉంటుందని అన్నారు.వెయ్యి లీటర్ల ఆయిల్ వచ్చినా కొందరికి 50 లీటర్ల చొప్పున ఇస్తే కేవలం కొద్ది మందికే దొరుకుతుందని, మిగిలిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. అందువల్ల బంకు యజమానులు బాధ్యతగా వ్యవహరించి అందరికీ ఇంధనం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే బంకుల వద్ద ప్రజలు బారులు తీరే పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమాన పంపిణీ విధానం అమలు చేయాలని బంకు యాజమాన్యాన్ని కోరారు.

## ప్రతి వ్యక్తికి సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించాలి

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి, మహా :** జన గణన 2027లో భాగంగా ప్రతి వ్యక్తికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించాలని సంబంధిత అధికారులకు యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు.మంగళవారం మోత్కూర్ మున్సిపాలిటీ, మోత్కూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో నిర్వహించిన జనగణన2027 గణనకు సంబంధించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన దేశ అభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని అన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించడం ద్వారా ప్రభుత్వ విధానాల రూపకల్పనకు దోహదపడుతుందని తెలిపారు.గణన ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది బాధ్యతాయుతంగా, ఖచ్చితత్వంతో సమాచారం సేకరించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ పద్ధతుల్లో సమాచార సేకరణ, మొబైల్ యాప్ వినియోగం, డేటా నమోదు విధానం తదితర అంశాలపై వివరంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మీ మీ పరిధిలో కేటాయించిన కుటుంబాల సేకరణ వివరాలు సక్రమంగా ఉండాలన్నారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బంది తమకు ఏమైనా సందేహాలు ఉంటే ట్రైనర్ లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు.

**మోత్కూర్ పిహెచ్సి ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సిబ్బంది యొక్క రిజిస్టర్ లను తనిఖీ చేసి మొత్తం ఎంతమంది డాక్టర్లు,



సిబ్బంది ఉన్నారని ఆరా తీశారు. సిబ్బంది అందరూ వచ్చే పేషెంట్లకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రోజు ఓ.పి కు ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి పరిమితి అయిపోయిన మందులను తొలగించి ఉపయోగంలో ఉన్న మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పిహెచ్సిలో నార్మల్ డెలివరీ లు ఎన్ని జరుగుతున్నాయని, నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలని, ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో , సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరం

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి పట్టణంలో చేనేత కార్మికులకు వారి కుటుంబ సభ్యుల కోసం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపులో చేనేత కార్మికులకు అందిస్తున్న వైద్య సేవలు, హెల్త్ కార్డుల పంపిణీ, వివిధ రకాల వైద్య పరీక్షలు, అందిస్తున్న మందుల వివరాలపై జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డిఎం ఎచ్ ఓను మరియు స్పెషలిస్ట్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అదనంగా, మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను కూడా ఈ హెల్త్ క్యాంప్‌లో ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే, ఇలాంటి ఆరోగ్య శిబిరాలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా చేనేత & జౌళి శాఖ మరియు వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.వైద్య శిబిరంలో ఈరోజు మొత్తం 97 మందికి చికిత్స అందించడం జరిగింది. ఇందులో 15 మందిని తదుపరి వైద్య చికిత్స కొరకు గవర్నమెంట్ జనరల్



హాస్పిటల్ భువనగిరికి రిఫర్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు, చేనేత & జౌళి అధికారిశ్రీనివాస్ ,గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ భువనగిరి నుంచి స్పెషలిస్ట్ వైద్యులు, డిప్యూటీ డిఎంహెచ్వో చౌటుప్పల్ యశోద , డిప్యూటీ డిఎంహెచ్వో భువనగిరి సుమన్ కళ్యాణ్ , పోచంపల్లి వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి , MLHPs, సూపర్వైజర్స్, సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నివారణపై విద్యార్థినులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం




**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండల కేంద్రంలో బాల్య వివాహాల నివారణపై విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మందా నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు చిన్న వయసులో వివాహం చేసుకోవడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, శారీరక-మానసిక ఇబ్బందులు, చదువుకు కలిగే అంతరాయం, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి అధికారులు వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రతి ఒక్కరూ వాటిని అరికట్టేందుకు ముందుకు రావాలని సూచించారు.తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సరైన వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు జరిపించాలని, బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు సహకరించాలని కోరారు.

## భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులను వెంటనే పూర్తి చేయాలి

### సమావేశంలో రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాసరెడ్డి డిమాండ్




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం రైల్వే స్టేషన్ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని మణుగూరు టు తిరుపతికి షిరిడీకి ప్రత్యేక రైలు నడపడంతో పాటు పలు సమస్యలపై మాట్లాడి రైల్వే అధికారులకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ డి ఆర్ యు సి సి మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే సంచలన్ భవన్ లో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ డి ఆర్ యు సి సి మెంబర్స్ సమావేశంలో జరిగిన పలు అంశాల వివరాలకు సంబంధించిన ఒక ప్రకటనను శ్రీనివాసరెడ్డి ప్రకటన విడుదల చేశారు. మణుగూరు టు డోర్నకల్ కాజీపేట ప్యాసింజర్ రైలును తిరిగి నడపాలని కోరారు. కొల్హాపూర్ బెల్గావి ఎక్స్ప్రెస్ ట్రైన్ ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం నుండి తిరుపతికి ప్రత్యేక రైలు నడుపుతామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని ఎప్పుడు ఈ రైలు నడుపుతారని అధికారుల మీద ఆగ్రహం వ్యక్తం చూసినట్లుగా తెలిపారు. కాజీపేట డోర్నకల్ టు మణుగూరు వరకు గతంలో నడిపిన ప్యాసింజర్ రైలును, కొలహపూర్ బెల్గావి ఎక్స్ప్రెస్ ను ఎందుకు ఆపారని ఈ ట్రైన్స్ ను తక్షణమే నడపాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ పనులు గత నాలుగు సంవత్సరాలుగా నత్త నడక నడుస్తున్నాయని ప్రజలు ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం నడిబొడ్డున రాజీవ్ పార్కు ప్రగతి మైదానం ఎన్జీవోస్ కాలనీ మధ్యలో గత అనేక సంవత్సరాలుగా ఉన్న రైల్వే ట్రాక్ దారిని మూసివేసారని దీనివలన ప్రజలు వాకర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఈ దారిని తిరిగి ఓపెన్ చేయాలనిగట్టిగా అధికారులకు విన్నవించారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్లో సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ప్లాట్ ఫామ్ వన్ కు రాకుండా రెండవ ప్లాట్ ఫామ్ మీద ఆపుతున్నారని దీనివలన ప్రయాణికులు వృద్ధులు మహిళలు దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తిరిగిసూపర్ ఫాస్ట్ ట్రైన్ నెంబర్ వన్ ప్లాట్ ఫామ్ మీదకు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్ నుండి త్రీ టౌన్ గొల్లగూడెం సెంటర్ వరకు రహదారి వెడల్పుకు పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి అభ్యర్థన మేరకు స్థలం తక్షణం ఏర్పాటు చేసి రహదారి వెడల్పుకు క్లియరెన్స్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రైల్వే సమస్యలపై వినతి పత్రాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాల కృష్ణన్ కి శ్రీనివాస్ రెడ్డి అందించడం జరిగింది. దీంతో అధికారులు స్పందిస్తూ సమస్యలను ఒక దాని వెంట ఒకటి సావధానంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులు డి ఆర్ యు సి సి మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి జన్మనక్షత్ర వేడుకలు..

- హరిహర సుతునికి పంచామృతాభిషేకాలు..
- మహా అన్నదానం, మజ్జిగ పంపిణీ..



**మణుగూరు, మహా :** శ్రీ హరిహర సుతుడు అయ్యప్ప స్వామివారి జన్మదిన నక్షత్రమైన ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని మణుగూరు పట్టణంలోని అశోక్‌నగర్‌లో మంగళవారం అయ్యప్ప భక్తిబృందం, ఐక్య అయ్యప్ప గురుపీఠాల గురుస్వాముల ఆధ్వర్యంలో వైభవంగా పూజా మహోత్సవాలు నిర్వహించారు. సతీష్‌గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ప్రత్యేక హోమం, అష్టద్రవ్య ఫలాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణ, పుష్పార్చన, పూజా కైంకర్యాలు ఘనంగా నిర్వహించారు. పంచలోహ విగ్రహానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదారలతో అభిషేకం చేయగా ఆలయ ప్రాంగణం భక్తి పరవశంతో నిండిపోయింది. స్వామియే శరణం అయ్యప్ప.. శరణం శరణం అయ్యప్ప.. అంటూ భక్తులు నామస్మరణ చేయడంతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వివిధ అయ్యప్ప పీఠాలకు చెందిన గురుస్వాములు, భక్తులు భజనలు, భక్తిగీతాలు ఆలపించి కార్యక్రమానికి మరింత భక్తి శోభను తీసుకొచ్చారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు వేసవి తీవ్రత దృష్ట్యా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం మహాభిక్ష అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి వందలాది మంది భక్తులకు ప్రసాద విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సతీష్ గురుస్వామి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ప్రతి నెలా ఒక్కో గురుపీఠం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని, ఈ నెల అశోక్‌నగర్‌లో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సింగారం సర్పంచ్, ఉపసర్పంచ్ కలిబోయిన మాధవరావు, గాండ్ల సురేష్, ఐక్య అయ్యప్ప గురుపీఠాల గురుస్వాములు, అయ్యప్ప భక్తిబృందం సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లాలో పెట్రోల్ డీజిల్ వంటి ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన జిల్లావ్యాప్తంగా ఇంధన సరఫరా ధాన్యం కొనుగోలు ఎస్ఐఆర్ మ్యాపింగ్ అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ఇంధన కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన ఇంధనం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. తహసీల్దారులు క్షేత్రస్థాయిలో పెట్రోల్ బంకులను సందర్శిస్తూ స్టాక్ ఇండెంట్ వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని ఏవైనా లోపాలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించాలని ఆదేశించారు. పెట్రోల్ డీజిల్ బ్లాక్ మార్కెట్ విక్రయాలను అరికట్టాలని ఎవరైనా బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు చేపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కూడా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు తహసీల్దారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం సేకరణలో పారదర్శకత పాటిస్తూ తేమ శాతం బరువు కొలతలు వంటి అంశాల్లో నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తూ మండలాల వారీగా పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో డేటా ఖచ్చితత్వం సమగ్రతను నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలను సమర్థవంతంగా అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ధరలు పెంపుకోసమే ఇంధన కొరత నాటకాలు

- ప్రభుత్వాల తీరుపై ఉద్యమించాలి
- న్యూడెమోక్రసీ నేత ఆవునూరి మధు




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పెట్రోల్ డీజిల్ రేట్ల పెంపుకోసమే ప్రభుత్వాలు సృష్టిస్తున్న కృత్రిమ కొరత అని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఆవునూరి మధు అన్నారు. న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పెట్రోల్ డీజిల్ కొరతపై కొత్తగూడెం పెట్రోల్ బంకులో పరిశీలన చేసిన అనంతరం పోస్ట్ ఆఫీస్ పెట్రోల్ బంక్ సెంటర్ బస్టాండ్ సెంటర్లలో మంగళవారం నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. అనంతరం ఆవునూరి మధు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కావాలని దేశంలో సరిపడా పెట్రోల్ డీజిల్ ఉన్న ధరల పెరుగుదల కోసమే మోడీ ప్రభుత్వం ఆయిల్ కంపెనీలు కుమ్మక్కై ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నాయి. ఈ కొరత మూలంగా అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరలు పెరగనున్నాయి. కాబట్టి ప్రభుత్వం ఈ ప్రజావ్యతిరేక వైఖరిని అర్థం చేసుకొని ప్రజలు ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించాలని కోరారు. వివిధ రాష్ట్రాలలో ఎన్నికల అనంతరం పెట్రోల్ డీజిల్ ధరలను పెంచనున్నాయి. ఈ ప్రమాదకర పరిస్థితిని ప్రజానీకం అర్థం చేసుకొని ప్రభుత్వాల ఈ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలకు రావాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ పెట్రోల్ డీజిల్ సమస్య వలన మొత్తం అభివృద్ధి కార్యక్రమాలు కూడా కుంటుపడ్డాయని వారన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మరోపక్క కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా యంత్రాంగం ఎస్పీ కలెక్టర్లతో సహా అందరూ డీజిల్ పెట్రోల్ కొరతలేదని ఎవరు కంగారు పడవద్దు అని చెబుతూనే ఈ కృత్రిమ సమస్యను సృష్టిస్తున్నారని అన్నారు. పెట్రోల్ డీజిల్ తక్షణమే బంకులలో సరఫరా చేయాలని నిలుపుదల చేసుకొని పెట్రోల్ బంకులు మూసిన యజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు ఎన్ సంజీవ్, మంకెన వెంకటేశ్వర్లు, మోత్కూరి మల్లికార్జునరావు, బి.వెంకటమ్మ, లిక్కి నరేష్, వెంకటేశ్వర్లు, ప్రణయ్, ధమరుకేష్, మంతేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని పోస్టుమాస్టర్ మృతి



**చర్ల మహా :** చర్ల మండలం పెద్దపల్లి పంచాయతీలో గత రెండు సంవత్సరాలుగా పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గోసు ఉదయ్‌కిరణ్ సత్యనారాయణ పురం గ్రామంలో అద్దెకు ఉంటున్న నివాసంలో ఉరి వేసుకుని మృతి చెందడం జరిగింది.విషయం తెలుసుకున్న ఎస్సై నరేందర్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## మత్తుకు బానిసలై జీవితాలను చిత్తు చేసుకోవద్దు

**కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం పట్టణ పరిధిలో వివిధ సందర్భాల్లో గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తగూడెం టౌన్‌తో పాటు చుంచుపల్లి లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ లో పలు సందర్భాల్లో గంజాయి సేవిస్తూ పట్టుబడి కేసులను నమోదు అయిన యువకులను పిలిపించి వారి తల్లిదండ్రుల సమక్షంలో ఈ కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని డిఎస్పి నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై యువకులు తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచిగా చదువుకొని తమ తల్లిదండ్రులకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారధ్యంలో ఇకపై కొత్తగూడెం పట్టణ పరిసర ప్రాంతాల్లో నిరంతరం గస్తీని పెంచి ప్రత్యేక తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్నట్లు గానీ సేవిస్తున్నట్లు గానీ సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం టూ టౌన్ సిఐ ప్రతాప్, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, వన్టౌన్ సిఐ కరుణాకర్, త్రీటౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో.. బాల్యవివాహాలపై చైతన్య సదస్సు..



**మణుగూరు, మహా :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారం కార్యక్రమాల సందర్భంగా మణుగూరు బాపనకుంటలో మంగళవారం బాల్యవివాహాల నివారణ, బాలికల రక్షణ, సైబర్ భద్రతపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ పి జయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఓ జయలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికలు చిన్న వయస్సులోనే గర్భధారణకు గురై ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతినడంతో పాటు విద్యాభ్యాసం నిలిచిపోతుందని, భవిష్యత్ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు. బాల్యవివాహం ఒక కుటుంబానికే కాక సమాజానికే నష్టమని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ మాట్లాడుతూ బాల్యవివాహాల దుష్పరిణామాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికల చదువు, ఆరోగ్యం, భవిష్యత్ రక్షణకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సదస్సులో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నిషేధమని, వివాహ వయస్సు రాకముందే వివాహం జరిపిస్తే అది నేరమని హెచ్చరించారు. బాల్యవివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే యూట్యూబ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంపడంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాటిని దుర్వినియోగం చేసి సైబర్ నేరస్థులు మహిళలను వేధించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగబాబు, సిబ్బంది సుశీల, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**సత్తుపల్లి, మహా:** వేసవి ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలు తీవ్ర రూపం దాల్చడంతో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు ముందడుగు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ పరిధిలోని మేమున్నాం.. స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పాత, కొత్త బస్టాండ్ ప్రాంగణాలలో బూత్ లను ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ నిర్వాహకులు వేదుళ్ళ వీరబాబు(యోగా గురువు) మాట్లాడుతూ ప్రయాణాలలో అలసట చెందిన ప్రయాణికులకు మజ్జిగ పంపిణీతో దాహం తీర్చడం తమకు సంతోషంగా ఉంది అన్నారు. ఒక్కరోజు మజ్జిగ పంపిణీలో 650 మంది ప్రయాణికులకు మజ్జిగ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగ బృంద సభ్యులు, నాగమణి, శైలజ, సునీత, అబిద్, ఇమామ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాల చుట్టూ ఉన్న తోరణాలు తొలగింపు

**మున్సిపల్ ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించడం పట్ల మద్దెల బృందం ప్రత్యేక కృతజ్ఞతలు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద గల భారతరత్న అంబేద్కర్ విగ్రహాల చుట్టూ ఫ్లెక్సీలు రాజకీయ పార్టీల తోరణాలతో ఆవరణం అంతా కలుషితం చేస్తున్నారని వెంటనే వాటిని తీసివేసి ప్రక్షాళన చేయాలని ఇటీవల కొత్తగూడెం కార్పొరేషన్ మూడ్ గణేష్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తెలిపారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ బృందం ఇచ్చిన వినతిపత్రంపై మేయర్ గణేష్ స్పందించి మున్సిపల్ సిబ్బంది చేత విగ్రహాల చుట్టూ ఉన్న ఫ్లెక్సీలు రాజకీయ పార్టీల తోరణాలు పూర్తిగా తీసివేసి ఆ ప్రాంగణమంతా క్లీన్ గా చేయించి ప్రక్షాళన చర్యలు వెంటనే తీసుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లుగా పేర్కొన్నారు. రెండు అంబేద్కర్ విగ్రహాలు గల పోస్ట్ ఆఫీస్ సెంటర్ ని అంబేద్కర్ సెంటర్ "మహనీయుల ప్రాంగణం" అని కౌన్సిల్లో తీర్మానం చేయించి శాశ్వత నామకరణం చేయాలన్నారు. పాత అంబేద్కర్ విగ్రహం పక్కనగల శాశ్వత ఫ్లెక్సీ హోర్డింగును జెండా దిమ్మను పూర్తిగా తొలగించాలన్నారు. ఆ పక్కనే డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహ స్థలానికి శంకుస్థాపన జరిగినందున ఆ మొత్తం చుట్టూ ప్రదేశానికి ఫెన్సింగ్ వేసి మహనీయుల ప్రాంగణంగా పరిగణించి శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. అందులో గ్రీనరీ పెంచాలనిపాత విగ్రహం చుట్టూ గాని సర్కిల్ చుట్టూ గాని ఏ రకమైన ఫ్లెక్సీలు తోరణాలు కట్టకుండా చూడాలని సూచించారు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారికి ఐదువేలు జరిమానా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టబడుతుందని హెచ్చరికతో ఒక బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. సర్కిల్లో గల అంబేద్కర్ కాంస్య విగ్రహం పైన శాశ్వతమైన పెద్ద లైటును ఏర్పాటు చేసి కలర్స్ తో వాటర్ ఫౌంటెన్ పనిచేయునట్లుగా పునరుద్ధరించాలని చెప్పారు. ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించబడిన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ మున్సిపల్ కార్పొరేషన్ స్వాధీనంలో ఉన్నందున దానిలో పూర్తి సౌకర్యాలు కల్పించడానికి కావలసిన ఇతర నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. వీటన్నింటినీ స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకి కూడా విన్నవించడం జరిగిందని కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ సారధ్యంలో పై డిమాండ్లన్నిటిని త్వరితగతిన పూర్తి చేసిమన భారత జాతిని సమైక్యంగా ఉంచి తన అపరిమిత మేధస్సుతో అన్ని వర్గాల ప్రజలకు ఉపయుక్తమైన ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని రచించి సామాజిక న్యాయం కోసం సమ సమాజ స్థాపన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగధనుడు మహనీయుడు భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ రుణాన్ని తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సబ్బారపు మధుసూదన్ చిన్ని, రాష్ట్ర ఉపాధ్యక్షులు అపరబాలు అల్లిశంకర్, మరొక రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా రమేష్, టిఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు మచ్చా పృథ్వీరాజ్, తెలంగాణ ఎం వై ఎస్ జిల్లా నాయకులు బొమ్మెర అశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకులు ముందస్తు అరెస్ట్

- అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు
- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ



**జూలూరుపాడు, మహా:** ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరగనున్న హలో విద్యార్థి చలో సీఎం ఇంటి కార్యక్రమం పిలుపులో భాగంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీని సోమవారం రాత్రి జూలూరుపాడు పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలు విడుదల చేయమంటే అక్రమ అరెస్టు లు చేసి, విద్యార్థి ఉద్యమాన్ని అణిచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోతే విద్యార్థులను ఏకం చేసి, రాష్ట్ర ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధమవుతామని వంశీ హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు. తక్షణమే నిధులు విడుదల చేయాలని పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు. వంశీతో పాటు, జిల్లా సమితి సభ్యులు గుగులోతు అనిల్ కుమార్, బానోతు బాలాజీ అరెస్టయిన వారిలో ఉన్నట్లు వంశీ తెలిపారు.

## సమాచార హక్కు పౌరుడి చేతిలో వజ్రాయుధం..

- పారదర్శకతే లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలి..
- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి..




**నల్గొండ, మహా :** ప్రభుత్వ అధికార యంత్రాంగాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం పౌరుడి చేతిలో వజ్రాయుధంలా పనిచేస్తుందని రాష్ట్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పౌర సమాచార అధికారులు, అధికార యంత్రాంగాలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అనేది ప్రజలకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని అడిగిన సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత పబ్లిక్ అథారిటీలపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ తాము ప్రజాసేవకులమనే విషయాన్ని విస్మరించరాదని, చట్టంలోని చాప్టర్లు, సెక్షన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరులకు సమాచారం కోరే హక్కుతో పాటు రికార్డులను మరియు క్షేత్రస్థాయి పనులను తనిఖీ చేసే అధికారం కూడా ఉందని చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. అధికారులు కేవలం సమాచారం అడిగినప్పుడే స్పందించడం కాకుండా సెక్షన్ 4(1) బి ప్రకారం స్వచ్ఛందంగా వివరాలను వెల్లడించేలా వ్యవస్థను సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా పబ్లిక్ అథారిటీల విధులు, బాధ్యతలకు సంబంధించిన రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 1.20 లక్షల దరఖాస్తుల్లో లక్ష మందికి సమాచారం అందించడం రాష్ట్ర యంత్రాంగం సాధించిన గొప్ప విజయమని ఆయన కొనియాడారు. గత పది నెలల్లో కమిషన్ 15 వేల కేసులను పరిష్కరించిందని కావాలని సమాచారం ఇవ్వని 15 మంది అధికారులపై చర్యలు కూడా తీసుకున్నామని వెల్లడించారు. మే 15 నాటికి రెవెన్యూ, మున్సిపల్ విభాగాలు మినహా మిగిలిన అన్ని పెండింగ్ కేసులను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఆర్టీఐ అమలులో భారతదేశం నాలుగో స్థానంలో ఉందని, 2005లో భారత్‌లో అమల్లోకి వచ్చిన ఈ చట్టంపై అధికారులు పూర్తి పట్టు సాధించాలని కోరారు. మరో కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి స్పందిస్తూ 60 నుంచి 70 శాతం అప్పీళ్లు 4(1) బి రిజిస్టర్ల నిర్వహణ లోపం వల్లే వస్తున్నాయని, వీటిని సరిదిద్దాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ సెక్షన్ 6(3) కింద దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, మొదటి అప్పీలేట్ అథారిటీ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమైతే పైస్థాయికి కేసులు రావని సూచించారు. రాష్ట్ర సమాచార కమిషన్ నుంచి వచ్చే నోటీసుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిషనర్ మోహిన్ పర్వీన్ వివరించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టం దరఖాస్తులను క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి, డిఎఫ్ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడు తెల్లం నరేష్‌కు ఎమ్మెల్యే నివాళి



**చర్ల మహా :** దుమ్ముగూడెం మండలం సీతానగరం గ్రామంలో ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, గిరిజన యువ కెరటం తెల్లం నరేష్ మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు ఆయన పార్థివ దేహంపై కాంగ్రెస్ కండువా కప్పి నివాళులర్పించారు.ఈ సంతాప కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లంక అబ్బులు, పీసీసీ మెంబర్ బట్ట మోహన్ గాంధీ, మాజీ జడ్పీటీసీ సత్యాలు, సీనియర్ నాయకుడు ఆకుల కృష్ణ, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొని తెల్లం నరేష్‌కు ఘనంగా నివాళులర్పించారు. నరేష్ సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, మహా:** అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల రెండు పడక గదుల ఇండ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కనిపించే ఉద్దేశంతో చేపట్టిన రెండు పడక గదుల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం నియోజకవర్గ కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి కార్యాలయ రికార్డులు, దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నివారణకు సమిష్టి కృషి అవసరం

### తాండూరు మండలం వైద్యాధికారి డా.ఝాన్సీ రాణి



**బెల్లంపల్లి,మహా:** క్షయ వ్యాధి నివారణకు వ్యాధి పట్ల అవగాహన, పరీక్షల నిర్వహణతోనే అరికట్టవచ్చని అందుకు సమిష్టి కృషి అవసరమని తాండూరు మండల వైద్యాధికారి డా. ఝాన్సీ అని పేర్కొన్నారు. మంగళవారం నాడుతాండూరు మండలం అచ్చులాపూర్ గ్రామంలో ఉచిత టీబీ వైద్య శిబిరంను నిర్వహించారు. అనుమానితులకు ఎక్స్‌రే పరీక్షలు చేసి, తగు జాగ్రత్తలు సూచించారు.ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ఝాన్సీరాణి మాట్లాడుతూ తాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అచ్చులపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రేచిని ఆయుష్మాను ఆరోగ్య మందిర్ లోని బలహానుపూర్ లో టి బీ ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా హాజరైన పేషెంట్ లతో సూపర్వైజర్ మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణ కై వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తూ రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయవ్యాధిగా అనుమానించాలన్నారు. క్షయవ్యాధి వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని దీంట్లో భాగంగా పోస్టర్లని అవగాహన కొరకు ప్రోగ్రాం అధికారి డా. సుధాకర్ నాయక్ తో పాటు మెడికల్ ఆఫీసర్ డా.ఝాన్సిరాణి ఆదేశాలప్రకారం విడుదల చేసి గ్రామ పంచాయతి ముందు ఆవిష్కరించారు. హాజరైన పేషెంట్లు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడపరీక్షలు,ఎక్స్ రే పరీక్ష ఉచితంగా చేస్తున్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల రూ. 1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగావ్యాప్తిస్తుందని అందుకు అన్నిరకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గం అన్నారు.తగిన జాగ్రత్తలు లక్షణాల గురించి వివరించారు. సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు అని తెలిపారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగాఉంటుందని తెలిపారు. పాల్గొన్నారు.అవసరమైన వారికి 150 xray టెక్నీషియన్ పవన్ fortable hand xray ద్వారా 131 మందికి, తెమడ పరీక్ష కొరకు 26 మందివి తీ తీసుకోవడం జరిగింది. కార్యక్రమం లో క్షయవ్యాధి సూపర్ వైజర్ శ్రీపెల్లి శశి కాంత్,ఆరోగ్య సిబ్బంది ప్రసన్న,దౌలత్, పంచాయతి కార్యదర్శి కల్పన, సర్పంచు స్రవంతి శ్రీనివాస్,హెల్త్ సూపర్వైజర్ రమాదేవి,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్,ఏ ఎన్ ఎం లు స్రవంతి, శ్రీలత, ఆశ కార్యకర్తలు హారిక, మంజుల,నర్సు గంగుభాయీ, సునీత,సుమలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ దేశం కోసం దర్మం కోసం పాటుపడాలి

### పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ విశ్వంబరస్వామి జీ



**బెల్లంపల్లి, మహా:** ప్రజలందరూ దేశం కోసం దర్మం కోసం పాటుపడాలని పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ విశ్వంబరస్వామి జీ పిలుపునిచ్చారు.బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో హిందూసమ్మేళనం సభ ఏర్పాటు చేయగా కార్యక్రమం లో గౌరవ అతిధిగా పరమపూజ్య శ్రీశ్రీశ్రీ విశ్వంబర స్వామి జీ తోపాటు ప్రధాన వక్త రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా ప్రచారక్ నాగరాజు ,మహిళ వక్త లక్ష్మి లు పాల్గొని మాట్లాడుతూ దేశంలో ఉన్న పరిస్థితులు, కుటుంబ చైతన్యం, ఆధ్యాత్మికత, హిందూ ధర్మ విశిష్టత గురించి వివరించారు. ప్రజలు అంత దేశం కోసం దర్మం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం లో పెద్ద ఎత్తున ఉమ్మడి ఆకెనపల్లి ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్గొండలో 'వేణు విద్య' ఆసుపత్రి నిర్లక్ష్యం....!

- గర్భిణికి గర్భనిరోధక మాత్రలు రాసిన డాక్టర్..
- ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ బంధువుల ఆందోళన..
- ప్రభుత్వ వైద్యురాలి ప్రైవేటు 'దోపిడీ'పై ప్రజల ఆగ్రహం..

**నల్గొండ, మహా :** జిల్లా కేంద్రంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో దారుణమైన వైద్య నిర్లక్ష్యం వెలుగుచూసింది. చికిత్స కోసం వచ్చిన ఆరు నెలల గర్భిణికి ఏకంగా గర్భనిరోధక మాత్రలు రాసి ఇచ్చిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పట్టణంలోని వేణు విద్య హాస్పిటల్‌లో చోటుచేసుకున్న ఈ ఉదంతంపై బాధితురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బాధితుల కథనం ప్రకారం..గిరకబాయి గూడెంకి చెందిన ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి వేణు విద్య ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందుతున్నారు. ప్రస్తుతం ఆమె ఆరో నెలలో ఉండగా, సాధారణ చెకప్ కోసం రాగా గైనకాలజిస్ట్ డాక్టర్ విద్యా భార్గవి మందులు రాసిచ్చారు. అయితే ఆ ప్రిస్క్రిప్షన్‌ను అనుమానంతో ఇతర వైద్యులకు చూపించగా అవి గర్భనిరోధక మాత్రలని తేలింది. ఈ మందులు వాడితే తల్లి, బిడ్డ ఇద్దరికీ ప్రాణాపాయం ఉంటుందని ఇతర వైద్యులు హెచ్చరించడంతో బాధితులు దిగ్భ్రాంతికి గురయ్యారు. తమకు జరిగిన అన్యాయంపై బాధితులు ఆసుపత్రి యాజమాన్యాన్ని నిలదీయగా..మనుషులన్నాక పొరపాట్లు జరగడం సహజమని ఆ మాత్రలు వేసుకున్నా ఏమీ కాదు అంటూ డాక్టర్లు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం గమనార్హం. ప్రొఫెసర్ హోదాలో ఉండి, ప్రాణాలను కాపాడాల్సిన వైద్యులే ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. తమ బిడ్డకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని బాధితులు ఆరోపించారు. ఈ వివాదంలో మరో కీలక అంశం చర్చనీయాంశమైంది. డాక్టర్ విద్యా భార్గవి ఒకవైపు ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తూనే, మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ఆసుపత్రిని నడుపుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.



## సినిమా వార్తలు | MOVIE NEWS



# పెళ్లి కాకుండానే పిల్లలు..

## టాలీవుడ్ హీరోయిన్ నిత్యామీనన్

హీరోయిన్ నిత్యామీనన్ గురించి తెలుగువారికి పరిచయం అక్కర్లేదు. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా మెప్పించింది. అలా మొదలైంది సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన మలయాళ ముద్దుగుమ్మ తెలుగులో పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు. గతేడాది ఇడ్లీ కొట్టు, తలైవన్ తలైవి, కాదలిక్కా నెరమిల్లై చిత్రాల్లో కనిపించింది. ప్రస్తుతం ఈ బ్యూటీ నిర్మాతగా ఎంట్రీ ఇస్తున్నారు. కేయూరీ ప్రొడక్షన్స్ అనే పేరుతో నిర్మాణ సంస్థ కూడా ప్రారంభించారు. అయితే ఇటీవలే 39వ వసంతంలోకి అడుగుపెట్టిన మలయాళ బ్యూటీ పెళ్లి గురించి గతంలో చాలాసార్లు మాట్లాడింది. తాజాగా మరోసారి పెళ్లిపై నిత్యా చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. గతంలో సరైన వ్యక్తి దొరికితే పెళ్లి చేసుకుంటానని చెప్పిన ముద్దుగుమ్మ.. పెళ్లి అనేది జీవితంలో ఓ భాగం మాత్రమేనని అన్నారు. తాజాగా మరోసారి పెళ్లి, పిల్లలు అనే కాన్సెప్ట్‌పై మాట్లాడింది. ఈ సందర్భంగా ఆసక్తికర కామెంట్స్ చేసింది. పెళ్లికి.. పిల్లల్ని కనడానికి ఎలాంటి సంబంధం లేదని నిత్యా మీనన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. పిల్లలు కావాలనుకోవడం అనేది పూర్తిగా మన వ్యక్తిగత నిర్ణయమని అన్నారు. అందుకు పెళ్లి ఒక్కటే మార్గం కాదన్నారు. పెళ్లి చేసుకోకుండా పిల్లలను కనడం తప్పేం కాదని నిత్యామీనన్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. పెళ్లి కేవలం లైఫ్‌లో ఓ పార్ట్ మాత్రమేనని.. ప్రస్తుతం తనకు పెళ్లి చేసుకునే ఆలోచన లేదన్నారు. పిల్లల్ని కనడానికి పెళ్లికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం తనపై ఎలాంటి ఒత్తిడి లేదని తెలిపారు. సింగిల్ లైఫ్‌ను ఆస్వాదిస్తున్నానని పేర్కొన్నారు.



# #కింగ్ 100లో ఎంట్రీ

నాగార్జున హీరోగా నటిస్తున్న '#కింగ్ 100' సినిమాలో భాగమయ్యారు నటి టబు. ఆర్‌ఏ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారని తెలిసింది. కాగా, ఈ సినిమాలో నటి టబు భాగం అయినట్లుగా మేకర్స్ సోమవారం ప్రకటించారు. "సెట్స్‌లో మీ రాక మాకెంతో గౌరవంగా ఉంది. ఈ సినిమాలో మీరు భాగం కావడంతో మా మైల్‌స్టోన్ సినిమా మరింత స్పెషల్‌గా మారిపోయింది" అంటూ '#కింగ్ 100' సినిమా యూనిట్ పేర్కొంది. అలాగే ఈ సినిమా చిత్రీకరణలో తాను జాయిన్ అయినట్లు ఇన్‌స్టా వేదికగా టబు పేర్కొన్నారు. అయితే ఈ సినిమాలో నాగార్జునకు జోడీగా టబు కనిపిస్తారా? లేదా కీలక పాత్ర చేస్తున్నారా? అనేది తెలియాల్సి ఉంది. నాగార్జున కెరీర్‌లోని ఈ వందో సినిమాలో సుస్మితా భట్, విజయేంద్ర ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారని, తండ్రీకూతుళ్ల ఎమోషన్ బ్యాక్‌డ్రాప్‌తో ఈ సినిమా కథనం సాగుతుందని తెలిసింది. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... 'నిన్నే పెళ్లాడతా'(1996), 'ఆవిడా మా ఆవిడే' (1998) చిత్రాల్లో నాగార్జున, టబు జోడీగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.



# గాయపడ్డ సింహం సంతృప్తి ఇస్తుంది: ఫరియా అబ్దుల్లా

''గాయపడ్డ సింహం' చిత్ర కథ వినగానే కొత్తగా అనిపించింది. కశ్యప్ శ్రీనివాస్‌గారు నా పాత్ర గురించి చెప్పినప్పుడు చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ఇందులో ప్రతి పాత్రకి ప్రాధాన్యం ఉంటుంది. నేను చేసిన షాలిని పాత్రలో వినోదం ఎక్కువగా ఉంటుంది. మా మూవీ చూసిన ప్రేక్షకులకు ఓ మంచి సినిమా చూశామనే సంతృప్తి కలుగుతుంది'' అని హీరోయిన్ ఫరియా అబ్దుల్లా చెప్పారు. తరుణ్ భాస్కర్ హీరోగా, ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గాయపడ్డ సింహం'. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జేడీ చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. డైరెక్టర్ పవన్ సాధినేని సమర్పణలో కల్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సాల్ నిర్మించిన ఈ సినిమా మే 1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా పంచుకున్న విశేషాలు....

నేను ఏదైనా ఓ సినిమా ఒప్పుకోవాలంటే కథ, నా పాత్ర నచ్చాలి. 'గాయపడ్డ సింహం'లో వ్లాగర్ షాలిని పాత్ర చేశాను. కశ్యప్ క్రియేట్ చేసిన యూనివర్స్, క్యారెక్టర్స్ అన్నీ చాలా హిలేరియస్‌గా వచ్చాయి. మా మూవీ ఫైనల్ ఔట్‌పుట్ చూశాను.. చాలా అద్భుతంగా వచ్చింది. సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. తరుణ్ భాస్కర్‌గారు సరదాగా ఉంటారు. ఆయన సెట్స్‌లో చిన్న ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినా నాకు నవ్వు వచ్చేది. ఈ మూవీలో శ్రీవిష్ణుగారి క్యారెక్టర్ చాలా ఆసక్తిగా ఉంటుంది. ఇందులో ప్రేమికుడి చేయి వదిలేసిన అమ్మాయిగా మానసా చౌదరి చేస్తే.. ఆ చేతిని పట్టుకునే అమ్మాయి పాత్ర నాది (నవ్వుతూ). 'గాయపడ్డ సింహం'లో యాక్షన్, రొమాన్స్, కామెడీ.. ఇలా అన్ని అంశాలను కలిపి హిలేరియస్‌గా తెరకెక్కించారు కశ్యప్ శ్రీనివాస్‌గారు. స్వీకర్ అగస్తి చాలా అందమైన సంగీతం ఇచ్చారు. 'బ్రైడ్...', 'జింగాల...' నాకు ఇష్టమైన పాటలు. ఈ చిత్రానికి నలుగురు నిర్మాతలు ఉన్నారు.. అందరూ చాలా క్రియేటివ్‌గా ఆలోచించే వారు. ఈ మూవీలో జేడీ చక్రవర్తిగారితో నాకు కాంబినేషన్ సీన్స్ లేవు. దుల్కర్ సల్మాన్‌గారి సినిమాలో అతిథి పాత్ర వస్తే చేయాలనుకోవడం లేదు. పూర్తి స్థాయి నిడివి ఉండే పాత్ర చేయాలని ఉంది. వచ్చే ఏడాది నేను ఓ సినిమాకి దర్శకత్వం వహిస్తాను.. కొన్ని కథలు రాస్తున్నాను. ప్రస్తుతం 'భగవంతుడు', 'సిగ్మా' సినిమాలు పూర్తి చేశాను. సత్యదేవ్‌గారితో ఓ మూవీ చేస్తున్నాను. మరో రెండు సినిమాలు ప్రారంభం కాబోతున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com